MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 292 | పేజీలు : 8 | ఆదివారం 11 అక్టోబర్ 2026 | వెల : 6-00



గిరిజనాభివృద్ధికి బాసట... అడవితల్లి బాట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో దశాబ్దాల కలలకు
దారి చూపుతున్న అడవితల్లి బాట మొదటి దశ విజయం స్ఫూర్తిగా... ఇప్పుడు

₹2,052 కోట్లతో
అడవితల్లి బాట 2.0

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రివర్యులు

శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారిచే ప్రారంభం

సమయం & తేదీ : 11.30 గంటలకు, 11 అక్టోబర్, 2026
స్థలం : కాకవాడ గ్రామం, రంపచోడవరం మండలం, పోలవరం జిల్లా

01 మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడమే 'అడవితల్లి బాట' లక్ష్యం

02 మొదటిదశలో 735 గిరిజన ఆవాసాలకు రూ.1,232 కోట్లతో రహదార్లు

03 ఇప్పటికే 1,281 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తి

04 మరో 150 ఆవాసాలకు రూ.425 కోట్లతో 450 కిలోమీటర్ల రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి

05 అడవితల్లి బాట 2.0 కింద మరో 1,341 ఆవాసాలకు రూ.2,052 కోట్లతో 1,976 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి సంకల్పించింది ప్రజా ప్రభుత్వం

జారీచేసిన వారు: సంబంధిత శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

గిరిజన ప్రాంతాల్లోని గ్రామాలను డోలీ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజలందరి పండుగగా విజయవాడ ఉత్సవ్ 2.0

దసరా అంటేనే విజయవాడ గుర్తుకొచ్చేలా వేడుకలు: కేశినేని జానకి లక్ష్మి

సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏర్పాట్ల పరిశీలన.. కార్యక్రమాల బ్రోచర్ విడుదల

విజయవాడ, మహానగర్



విజయవాడ ఉత్సవ్ 2.0ను ప్రజలందరి పండుగగా నిర్వహిస్తూ, దసరా అనగానే దేశవ్యాప్తంగా విజయవాడ గుర్తుకొచ్చేలా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకి లక్ష్మి తెలిపారు. నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఉత్సవ్ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్సవంలో నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ ఏడాది విజయవాడ ఉత్సవ్ 2.0ను గతంలో కంటే మరింత ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రులు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వంటి ప్రముఖులు పాల్గొనేలా కార్యక్రమాలను రూపొందించడం నగరానికి గర్వకారణమని పేర్కొన్నారు. విజయవాడ చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దేశవ్యాప్తంగా చాటిచెప్పాలనే లక్ష్యంతో ఎంపీ కేశినేని శివనాథ్ గత ఏడాది విజయవాడ ఉత్సవ్‌కు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 100కు పైగా పోటీలు, ఏడు విభాగాల్లో ట్రైటిల్ పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతిరోజూ వందలాది మంది ఔత్సాహికులు పాల్గొని తమ ప్రతిభను చాటుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులు, యువత, మహిళలు, కళాకారుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు కళలు, సంస్కృతిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. "మనం ఇంట్లో జరుపుకుంటే అది పండుగ.. అందరం కలిసి జరుపుకుంటే అది ఉత్సవం" అని పేర్కొంటూ, విజయవాడ ఉత్సవ్ ఒక సంస్థకో, కొందరికో పరిమితమైన వేడుక కాదని, నగర ప్రజలందరూ తమ సొంత పండుగగా భావించి పాల్గొనాల్సిన ప్రజా ఉత్సవమని స్పష్టం చేశారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం నగరానికి వచ్చే లక్షలాది మంది భక్తులు, పర్యాటకులు ఉత్సవాల్లోనూ భాగస్వాములు కావాలనే లక్ష్యంతో కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. పగటిపూట అమ్మవారి దర్శనం, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాయంత్రం వేళల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాల ద్వారా సందర్శకులకు మరపురాని అనుభూతిని అందించనున్నట్లు వివరించారు. విజయవాడ ఆధ్యాత్మిక వైభవంతో పాటు కళా, సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందేందుకు విజయవాడ ఉత్సవ్ 2.0 దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నగర ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఏ సుంకర అక్కయ్య నాయుడు, డాక్టర్ చదలవాడ సుధా నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ అడ్వకేట్ వైట్ల కృష్ణ ప్రసన్న, తొండెపు హనుమంతరావు, తొండెపు ప్రసాద్ గుప్తా, వీరభట్ల విష్ణువర్ధన్, చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

271 మద్యం దుకాణాలకు రెండో విడత నోటిఫికేషన్

ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తులు

21న ఉదయం 8 గంటలకు లాటరీ

ఎక్సైజ్ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్



అమరావతి, మహానగర్

రాష్ట్రంలో 2026--27 మద్యం దుకాణాల విధానంలో భాగంగా తొలి విడతలో కేటాయింపు కాని 271 ఏ4 మద్యం దుకాణాలకు ప్రభుత్వం రెండో విడతలో నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఈ దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. తొలి విడతలో మిగిలిపోయిన దుకాణాలకు కేటాయింపులు పూర్తి చేసేందుకు ఈ చర్య తీసుకున్నట్లు నిషేధ, ఎక్సైజ్ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,736 ఏ4 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, 2,929 దుకాణాలు పునరుద్ధరణ ద్వారా, 517 దుకాణాలు తొలి విడత లాటరీ ద్వారా కేటాయించినట్లు వివరించారు. మరో 19 దుకాణాలకు గడువు పొడిగింపు ద్వారా కేటాయింపులు జరిగాయని తెలిపారు. మొత్తంగా 3,465 దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని, ఇది మొత్తం దుకాణాల్లో సుమారు 93 శాతమని పేర్కొన్నారు. రెండో విడత నోటిఫికేషన్‌లో 267 సాధారణ కేటగిరీ దుకాణాలు, నాలుగు రిజర్వుడు కేటగిరీ దుకాణాలు ఉన్నాయి. అర్హత కలిగిన ఆసక్తిగల వారు నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో దుకాణానికి తిరిగి చెల్లించని దరఖాస్తు రుసుము రూ.3 లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తులను అక్టోబర్ 19వ తేదీ అర్ధరాత్రి వరకు స్వీకరిస్తారు. అక్టోబర్ 21వ తేదీ ఉదయం 8 గంటలకు సంబంధిత జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో లాటరీ నిర్వహిస్తారు. ఎంపికైన దరఖాస్తుదారులకు అదే రోజు సమాచారం అందిస్తారు. కేటాయింపుల ప్రక్రియను ఎక్సైజ్ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాల వారీగా వైఎస్సార్ కడపలో అత్యధికంగా 33 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఎస్‌పీఎస్ నెల్లూరులో 24, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో 19 చొప్పున, పశ్చిమ గోదావరిలో 17, ప్రకాశంలో 16, అనంతపురంలో 15 దుకాణాలు ఉన్నాయి. అనకాపల్లి, కృష్ణా జిల్లాల్లో 13 చొప్పున, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 12 చొప్పున, మార్కాపురంలో 11, శ్రీకాకుళంలో 10 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. కాకినాడ, నంద్యాల జిల్లాల్లో ఎనిమిది చొప్పున, శ్రీ సత్యసాయి జిల్లాలో ఏడు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమలో ఆరు, ఏలూరు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఐదు చొప్పున దుకాణాలు ఉన్నాయి. అన్నమయ్యలో నాలుగు, చిత్తూరులో మూడు, అల్లూరి సీతారామరాజు, కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు చొప్పున దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. తూర్పు గోదావరి, పోలవరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రెండో విడతలో నోటిఫికేషన్ ఆవశ్యకత లేదు.

నేడు సెంటినీ డా. శ్రీమన్నారాయణ హాస్పిటల్ ప్రారంభం

150 పడకలతో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

విజయవాడ, మహానగర్



ఆధునిక వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా సెంటినీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మూడవ ఆసుపత్రిగా సెంటినీ డా. శ్రీమన్నారాయణ హాస్పిటల్‌ను ఈ నెల 11న ప్రారంభించనున్నట్లు గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మొవ్వ పద్మ తెలిపారు. నగర ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న సెంటినీ గ్రూప్, వైద్య రంగంలో రెండు దశాబ్దాలకు పైగా విశేష అనుభవం కలిగిన నిపుణుల నేతృత్వంలో 150 పడకల సామర్థ్యంతో ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తాడేపల్లిలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నగరంలోని ఎం.జి. రోడ్డులో ఉన్న హోటల్ ఫార్చ్యూన్ మురళిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఆసుపత్రి ప్రత్యేకతలను వివరించారు. సెంటినీ హాస్పిటల్స్ గ్రూప్ ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ జె.శ్రీమన్నారాయణ, ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ ఎన్.జగదీష్, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ లావు హరీష్, జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ తుళ్లూరి రేష్మా చౌదరి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన.మాధురి, మరియు రేడియాలజీ నిపుణులు డాక్టర్ సుషేన్‌లను ప్రమోటర్లుగా భాగస్వాములుగా కలిసి సెంటినీ డాక్టర్ శ్రీమన్నారాయణ హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. హాస్పిటల్ ప్రత్యేకతలను గురించి వివరిస్తూ అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక సదుపాయాలతో 150 పడకల హాస్పిటల్‌గా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రమోటర్లైన డాక్టర్లు టీం మాట్లాడుతూ, ఈ పరిసర ప్రాంత ప్రజలకు చుట్టుపక్కల జిల్లాల వారికి అత్యుత్తమ వైద్యం అందించడమే తమ ధ్యేయం అని అందుకు కట్టుబడి ఉంటామన్నారు. ఏ ఐ ఆధారిత వైద్యం అందించడం ఇక్కడ ప్రత్యేకతగా తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులను డైరెక్టర్లుగా, ప్రమోటర్లుగా భాగస్వామ్యం చేస్తూ అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక సదుపాయాలతో ఈ ఆసుపత్రిని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగంలో విశేష అనుభవం కలిగిన డాక్టర్ జె. శ్రీమన్నారాయణ, ట్రామా కేర్, జాయింట్ రీప్లేస్‌మెంట్, రోబోటిక్ చికిత్సల్లో నైపుణ్యం కలిగిన డాక్టర్ ఎన్. జగదీష్, న్యూరాలజీ విభాగంలో అనుభవజ్ఞులైన డాక్టర్ లావు హరీష్, జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ తుళ్లూరి రేష్మ చౌదరి, డాక్టర్ సుషేన్, రేడియాలజిస్ట్ డాక్టర్ ఎన్. మాధురితో పాటు ప్రసూతి, గైనకాలజీ తదితర విభాగాలకు చెందిన వైద్యులు సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మొవ్వ పద్మ మాట్లాడుతూ, నవ్యాంధ్ర రాజధాని ప్రాంతమైన తాడేపల్లి--అమరావతిలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన సెంటినీ డా. శ్రీమన్నారాయణ హాస్పిటల్ వైద్య రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గుండె, నాడీ వ్యవస్థ, మోకాళ్ల సమస్యలు, జీర్ణకోశం, శ్వాసకోశం, మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు సమగ్ర వైద్య సేవలు అందించడంతో పాటు, వారు కోలుకునే వరకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బాధ్యతతో, నిబద్ధతతో సేవలందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రతి రోగికి మెరుగైన చికిత్స, తగిన వైద్య పర్యవేక్షణ అందించడమే సెంటినీ గ్రూప్ ఆశయమని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఆసుపత్రి చైర్మన్ మొవ్వ ఆనంద్, డైరెక్టర్ మొవ్వ విష్ణు, ఆసుపత్రి సీఈఓ సి.ఎల్.ఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నిలిపివేసిన రోడ్డుకు పవన్ కళ్యాణ్ సహకారంతో మోక్షం



చల్లపల్లి, మహానగర్

వైసీపీ ప్రభుత్వం రాగానే నిలిపివేసిన రోడ్డుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మోక్షం కలిగిందని నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శనివారం సాయంత్రం చల్లపల్లి మండలంలో లక్ష్మీపురం నుండి చింతలమడలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. సుదీర్ఘ కాలంగా తాము ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు గ్రామస్తులు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో డిప్యూటీ స్పీకరుగా మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించిన ఈ రోడ్డు నిర్మాణ పనులను వైసీపీ అధికారంలోకి రాగానే రివర్స్ టెండరింగ్ పేరుతో ఆపేసిందన్నారు. గత ఐదేళ్లు ఈ రోడ్డు అభివృద్ధిని విస్మరించటంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఈ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పాత పనుల అగ్రిమెంట్ల కారణంగా ఎదురైన సాంకేతిక సమస్యలను పరిష్కరించి, అడ్డంకులు తొలగించి, తాజాగా పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 2.20 కిలోమీటర్లు నూతన తారు రోడ్డు నిర్మాణానికి వీబీజీ రాంజీ నిధులు రూ.కోటీ ఐదు లక్షల అరవై వేలు మంజూరు చేయించినట్లు తెలిపారు. తద్వారా ఈ రోడ్డు నిర్మాణంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కీలక పాత్ర పోషించారన్నారు. త్వరలో వంతెన నిర్మాణం కూడా పూర్తి అవుతుందన్నారు. దీంతోపాటు బిరుదుగడ్డకు గ్రావెల్ రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. పల్లె పండుగ-3.0 కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో రూ.17,18,35,000లు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, పీఏసీఎస్ చైర్మన్లు బొందలపాటి వీరబాబు, పరుచూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏడు కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కూరగాయల పంపిణీ

వాకాడు, మహానగర్



మండల పరిధిలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయంలో కొడవలూరు రాధాకృష్ణారెడ్డి స్మృత్యర్థం ఆయన కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్తలు, వాకాడు సొసైటీ మాజీ చైర్మన్ కొడవలూరు దామోదరరెడ్డి ఆర్థిక సహకారంతో ఏడు కుటుంబాలకు రూ.9 వేల విలువైన ఫలసరుకులు, కూరగాయలను పంపిణీ చేశారు. మహాలయ పక్షం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి గుంటూరు జిల్లా వైఖానస ప్రముఖులు పరుచూరు విష్ణువర్ధనాచార్యులు మాట్లాడుతూ పితృదేవతలకు ఉత్తమ గతులు కలగాలనే సదుద్దేశంతో కొడవలూరు దామోదరరెడ్డి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నరేష్ శర్మ, శేషాద్రి శర్మ, రూపేష్ కుమార్ శర్మ, మల్లాపు కిరణ్, తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యుడు దీవి అనంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నిలిపేసిన రోడ్డుకు పవన్ కళ్యాణ్ సహకారంతో మోక్షం

చల్లపల్లి, మహానగర్



వైసీపీ ప్రభుత్వం రాగానే నిలిపివేసిన రోడ్డుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మోక్షం కలిగిందని నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శనివారం సాయంత్రం చల్లపల్లి మండలంలో లక్ష్మీపురం నుండి చింతలమడలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. సుదీర్ఘ కాలంగా తాము ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు గ్రామస్తులు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో డిప్యూటీ స్పీకరుగా మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించిన ఈ రోడ్డు నిర్మాణ పనులను వైసీపీ అధికారంలోకి రాగానే రివర్స్ టెండరింగ్ పేరుతో ఆపేసిందన్నారు. గత ఐదేళ్లు ఈ రోడ్డు అభివృద్ధిని విస్మరించటంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఈ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పాత పనుల అగ్రిమెంట్ల కారణంగా ఎదురైన సాంకేతిక సమస్యలను పరిష్కరించి, అడ్డంకులు తొలగించి, తాజాగా పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 2.20 కిలోమీటర్లు నూతన తారు రోడ్డు నిర్మాణానికి వీబీజీ రాంజీ నిధులు రూ.కోటీ ఐదు లక్షల అరవై వేలు మంజూరు చేయించినట్లు తెలిపారు. తద్వారా ఈ రోడ్డు నిర్మాణంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కీలక పాత్ర పోషించారన్నారు. త్వరలో వంతెన నిర్మాణం కూడా పూర్తి అవుతుందన్నారు. దీంతోపాటు బిరుదుగడ్డకు గ్రావెల్ రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. పల్లె పండుగ-3.0 కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో రూ.17,18,35,000లు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, పీఏసీఎస్ చైర్మన్లు బొందలపాటి వీరబాబు, పరుచూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 292 | పేజీలు : 8 | ఆదివారం 11 అక్టోబర్ 2026 | వెల : 6-00



స్థానిక ఎన్నికల్లో బీసీలకు సగటున

28.18% రిజర్వేషన్లు

- రాజీవ్ రంజన్ మిశ్ర కమిషన్ సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం
- స్థానిక సంస్థల వారీగా బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు
- డెడికేటెడ్ కమిషన్ నివేదికతో బీసీలకు పెరగనున్న స్థానాలు
- ఈసీకి వివరాలు పంపించాం
- మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, సంధ్యారాణి, అనిత, పార్థసారథి, సత్యకుమార్, డీబీవీ స్వామి వెల్లడి

మొత్తంగా 34 శాతానికి పైగా వర్తించేలా కూటమి తరఫున అవకాశాలు



విజయవాడ, మహానగర్

రాజీవ్ రంజన్ మిశ్ర కమిషన్ (డెడికేటెడ్ కమిషన్) నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సగటున 28.18 శాతం మేర రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తంగా బీసీలకు 34 శాతానికి పైగా రిజర్వేషన్లు వర్తించేలా కూటమి పార్టీల తరఫున అవకాశాలివ్వాలని నిర్ణయించింది. డెడికేటెడ్ కమిషన్ 7 నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి వివిధ సామాజికవర్గాల నుంచి సమాచారం సేకరించింది. దీని ఆధారంగా స్థానిక సంస్థల వారీగా బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సమర్పించిన నివేదికలోని సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. తదుపరి చర్యల కోసం ఈ వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించింది. క్యాబినెట్ సమావేశం- మిగతా 2లో

నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

5లో

- దిల్లీలో ఉద్రిక్తతకు దారితీసిన సీజేపీ నిరసన
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీజేపీ చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి
- నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.





మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

- చేసిన నేరాలకు మూల్యం చెల్లించాల్సిందే'
- చెన్నైలో జరిగిన ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- దేశంలో ప్రజల గొంతులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది
- గత 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న నాటకం ముగింపు దశకు చేరుకుంది

5



గెలిస్తే నిజాయితీ.. ఓడితే అవకతవకలా?

- ఈసీకి మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌ల బహిరంగ లేఖ
- భారత ఎన్నికల సంఘానికి, సర్ ప్రక్రియకు మద్దతుగా 124 మంది సభ్యుల మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల
- ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదు



అక్టోబర్ 2028 నాటికి

రాజధాని పూర్తి చేయడమే లక్ష్యం

- ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం
- అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు
- ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

వివరాలు 2లో..

ప్రకృతి సేద్యంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానం

- ప్రకృతి సేద్యంలో ఏపీ నంబర్ 1, 25 లక్షల మంది రైతులు లక్ష్యం: సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను భాగస్వాములను చేయడమే లక్ష్యం
- రసాయనాలతో పోలిస్తే ప్రకృతి సాగుతో 47 శాతం పెరిగిన రైతుల ఆదాయం
- రసాయన ఎరువుల వాడకం తగ్గించినందుకు కేంద్రం నుంచి రూ.218 కోట్ల ప్రోత్సాహకాలు



విజయవాడ, మహానగర్

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రకృతి సేద్యం, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎండీఎస్)పై ఆయన శనివారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, రైతులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2016లో కేవలం 40 వేల మంది రైతులతో ప్రారంభమైన ఈ ప్రస్థానం నేడు 17.73 లక్షల మందికి చేరిందన్నారు. కొందరు గతంలో ఇది విజయవంతం కాదని దుష్ప్రచారం చేసినా, రైతులు అద్భుతమైన ఫలితాలు సాధించారని కొనియాడారు. రసాయన ఎరువులతో భూసారం క్షీణించి, సాగు ఖర్చులు పెరిగి రైతులకు భారం అవుతోందన్నారు. కానీ ప్రకృతి సేద్యం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని వివరించారు. "రసాయన ఎరువులతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు సగటున 47 శాతం మేర ఆదాయం పెరిగింది. పత్తి పంటలో 96 శాతం, కందుల్లో 87 శాతం నికర ఆదాయం లభించింది. తీవ్రమైన కరవు పరిస్థితులను సైతం తట్టుకుని ఈ విధానంలో మంచి దిగుబడులు వస్తున్నాయి," అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి - మిగతా 2లో

పార్టీ అభ్యర్థులకు రక్షణ కవచంగా లీగల్ సెల్

- స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైన దశలోకి వెళ్తున్నాయి
- పార్టీ లీగల్ సెల్ ఇక సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలి 2
- రాష్ట్రంలో చట్టాలు, నిబంధనలు, ఎన్నికల వ్యవస్థలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలవడం లేదు





విశ్వసనీయత పునాదులు తవ్వుతారా?

ఒక మనిషి శరీరంలో ఏదైనా అవయవం గాయపడితే, ఆ అవయవానికి చికిత్స చేసి నయం చేయడానికి ప్రయత్నిస్తాం తప్ప? దాన్ని నరికి పారేయాలని ఎవరు అనుకోరు. ప్రజాస్వామ్య వ్యవస్థలైనా అంతే!"ప్రజాస్వామ్య వ్యవస్థల్లో లోపాలు, వివాదాలు రావడం సహజం. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యంత కీలకమైన బాధ్యత నిర్వర్తించే ఎన్నికల సంఘం సైతం ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే, ఏదైనా లోపం కనిపించినంత మాత్రాన , ఎన్నికల నిర్వహణలో అభిప్రాయ భేదాలు తలెత్తినంత మాత్రాన? శతాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలిచిన ఒక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతనే పునాదులతో సహా తవ్వి తీయాలని చూడటం అత్యంత ప్రమాదకరం. ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి మొదలుకొని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వరకు ప్రతి చిన్న అంశం రాజకీయ వివాదాలకు ఆజ్యంగా మారుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టంపై నేడు తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సూచన మేరకు పార్లమెంట్ ద్వారా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఆ చట్టంలో సీజేఐ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తే వ్యవస్థకు మరింత తటస్థత వచ్చేదన్న మాట వాస్తవమే. కేంద్రం అలా చేయకుండా పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఈ చట్టాన్ని ఆమోదించింది.ఇది పార్లమెంట్ చేసిన రాజ్యాంగబద్ధమైన చట్టం. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరుగుతోంది కూడా. కానీ, చట్టంలోని నియమాలను బూచిగా చూపిస్తూ, కమిషనర్ల మధ్య ఉండే అంతర్గత అభిప్రాయ భేదాలను ఆధారంగా చేసుకుని, కమిషన్ మొత్తాన్నే ప్రధాన రాజకీయం వైపు నెట్టడం సమంజసమా?. ఇక్కడ అసలు విషయమేమిటంటే? ఎన్నికల సంఘం అనేది మ్యాచ్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించే అంపైర్ లాంటిది మాత్రమే. గ్రౌండ్‌లో ఆడేది రాజకీయ పార్టీలు, తీర్పు ఇచ్చేది ప్రజలు. ఎన్నికల సంఘం అనుకుంటే ఫలితాలను మార్చేస్తుందని అనుకోవడం, పక్షపాతం చూపిస్తుందని చెప్పడం కేవలం అపోహ మాత్రమే. అది అసాధ్యమని విమర్శలు చేసే రాజకీయ పార్టీలకూ లోపల బాగా తెలుసు. కానీ, ప్రస్తుత విపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఆయన రాజీనామాను తమ ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చుకున్నాయి. సీఈసీతో రాజీనామా చేయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మానసికంగా, రాజకీయంగా బలహీనపరిచామని చెప్పుకోవడానికి ఇదొక పొలిటికల్ టార్గెట్ గా మారింది.చరిత్ర తిరగేస్తే, ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య వివాదాలు లేదా విభేదాలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంట్లో నలుగురు అన్నాదమ్ములు ఉంటే గొడవలు రావడం సహజం? అంతమాత్రాన ఇల్లు కూల్చుకోరు కదా!. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ సింగిల్ మెంబర్ కమిషన్‌ను మల్టీ-మెంబర్ కమిషన్‌గా మార్చినప్పుడు తలెత్తిన ఘర్షణలు, ఆ తర్వాత ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తిల మధ్య నడిచిన సుదీర్ఘ ఆధిపత్య పోరాటం, లేదా 2009లో అప్పటి సీఈసీ ఎన్.గోపాలస్వామి తన తోటి కమిషనర్ నవీన్ చావ్లాపై వేటు వేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఘటన? ఇవన్నీ ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలకు నిదర్శనాలు. గతంలో అశోక్ లవాసా కూడా తన విభేదాభిప్రాయాలను రికార్డు చేశారు. ఇవన్నీ వ్యవస్థలోని ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అభిప్రాయ స్వేచ్ఛను చూపించే చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ మాత్రమే. అంతర్గత విభేదాలు ఉన్నంత మాత్రాన వారు నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని కానీ, కమిషన్ ఉనికినే రద్దు చేయాలని కానీ ఆనాడు ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు. కానీ, నేడు విపక్షాలు ఏకంగా ఎన్నికల చెల్లుబాటునే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి. ఇక్కడే అసలు ఓటమి రాజకీయం దాగి ఉందనేది స్పష్టమవుతోంది.ముఖ్యంగా కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ వరుస ఓటములకు ప్రజల తీర్పు కారణం కాదు, ఎన్నికల సంఘం , ఈవీఎంల మేనేజ్‌మెంట్‌యే కారణం అని ప్రజల మెదడుల్లోకి ఎక్కించాలని చూస్తున్నాయి. ఇది తీవ్రమైన ముప్పు. ఎలక్షన్ కమిషన్‌లో ఎవరున్నా, సీఈసీగా ఏ అధికారి కూర్చున్నా? క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేయకపోతే ఏ పార్టీ కూడా గెలవలేదు. ప్రజల్లో మద్దతు కోల్పోయినప్పుడు, తమ విధానాల్లోని లోపాలను సరిదిద్దుకోవడానికి బదులుగా రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం సడలిపోతుంది. దేశంలో ఒకప్పుడు ఈవీఎంల వ్యవస్థను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కాలం చెల్లిన వాదనలను ముందుకు తెస్తూ మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానమే కావాలని తీర్మానించడం విడ్డూరంగా ఉంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియకు ముందు పారదర్శకత కోసం చేపట్టే ఓటర్ జాబితా సవరణలను వ్యతిరేకించడం ద్వారా ఆ పార్టీ నిజస్వరూపం బయటపడుతోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. ఎన్నికల సంఘంలో లోపాలు ఉంటే, పారదర్శకత లోపిస్తే, నియామక ప్రక్రియలో అధికార పక్షం ఆధిపత్యం పెరిగితే? దానిపై ఖచ్చితంగా పోరాడాలి. న్యాయస్థానాల ద్వారా, పార్లమెంట్ చర్చల ద్వారా ఎన్నికల సంస్కరణల కోసం ఒత్తిడి తేవాలి. కానీ, తమ రాజకీయం కోసం, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం, వరుస ఓటములను కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థల విశ్వసనీయతనే తెగనరకడం రాజకీయం అనిపించుకోదు. అది కేవలం చేతకానితనం మాత్రమే అవుతుంది. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకుని, వారి మెప్పు పొంది గెలవడానికి ప్రయత్నించాలి. తమ వైఫల్యాలను ఎన్నికల సంఘంపైకి తోసేసి చేతులు దులుపుకునే సంస్కృతికి ఇప్పటికైనా స్వస్తి పలకాలి. వ్యవస్థల లోపాలను సరిదిద్దే దిశగా సాగే పోరాటమే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుంది తప్ప, వ్యవస్థలను నాశనం చేసే ధోరణి దేశానికే చేటు చేస్తుంది!. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి పార్టీలు అదే చేస్తున్నాయి.

ఢిల్లీ పాలకుల గుండెల్లో రైళ్లు



రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, హస్తిన పాలకులు ఆడుతున్న ప్రమాదకరమైన ఆట భవిష్యత్తు రాజకీయాలను నియంతృత్వ పోకడల వైపు మళ్లిస్తున్నది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను అడ్డుపెట్టుకుని ఆడుతున్న నాటకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.ఈ నేపథ్యంలో సర్ పేరిట జరిగిన అక్రమాలపై బాధ్యత వహిస్తూ సీఈసీ రాజీనామా చేయాలని యువతరం పోరుబాట పట్టింది. నేడు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ఆందోళనకు సిద్ధమైంది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో 'జెన్-జీ సీజన్-1' ఆందోళన దెబ్బను రుచిచూసిన బీజేపీ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అందుకే ఢిల్లీకి వెళ్లే చాలా రైళ్లను రద్దు చేశారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల వల్ల ఏర్పడే పాలనా వ్యవస్థ. ప్రజలే తమ పాలకులను ఎన్నుకునే గొప్ప విధానం. ప్రపంచంలో కాలక్రమంలో రాచరికం, నియంతృత్వం, సైనిక పాలన ఇలా ఎన్నో రకాల పాలనా పద్ధతులు రాజ్యమేలాయి. కానీ మహోన్నతమైనది, అత్యాధునికమైనది ప్రజాస్వామ్యమే. కానీ ఈ వ్యవస్థలోనూ కొందరు నియంతృత్వ పోకడలు కలిగిన నేతలు ప్రవేశించడంతో సమస్యలు మొదలయ్యాయి. దేశ, రాజ్యాంగ నిర్మాతలు గొప్ప వ్యవస్థలను రూపొందించారు. కానీ పాలకులకు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలపై విశ్వాసం లేకపోతే అవి అమలుకు నోచుకోవడం కష్టమే. కేంద్రంలో పద్నాలుగేండ్లుగా బీజేపీ పాలనలో ప్రజాస్వామిక విలువలు అపహాస్యం అవుతున్నాయి. ఏం చేసైనా, ఎంతకు దిగజారైనా అధికారం హస్తగతం చేసుకోవాలి, చేజిక్కిన అధికారాన్ని గుప్పిట్లోనే పెట్టుకోవాలి అనే అధికార, రాజ్యవిస్తరణ కాంక్షతో కమలం పార్టీ కార్యాచరణ అమలు చేస్తున్నది. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే సన్నద్ధత, శాస్త్ర, సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం అవసరం. కానీ బీజేపీకి ఆ ధ్యాస లేదు. ఎంతసేపూ పగటివేషాలు, పడికట్టు పదాల ప్రసంగాలే పాలన అనుకుంటున్నది.

బీజేపీ విద్వేషాలు రెచ్చగొట్టి సమాజంలో చీలిక తీసుకొస్తున్నది. అభంశుభం తెలియని యువత మెదళ్లలో అసత్యాలతో విషం నింపి, వారిని అంధభక్తులుగా మార్చుతున్నది. ప్రజాతీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం, ఇతర పార్టీలు అధికారంలో ఉన్నచోట పాలకపక్షాలను చీల్చడం, తమ బుట్టలో వేసుకోవడం, పొత్తు పెట్టుకున్న పార్టీల్లోనూ చిచ్చుపెట్టడం చూస్తూనే ఉన్నాం.

ఇక బీజేపీ పాలకుల 'వాషింగ్ పౌడర్ నిర్మా' రాజకీయాల గురించి తెలిసిందే! దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని నేతలను తమ పంచన చేర్చుకోవడం, వారికి పదవులు కట్టబెట్టడం, ఆ తర్వాత కేసులు మాఫీ కావడం ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నది. అధికారం దక్కించుకోవడం కోసం దబాయింపులకు పాల్పడు తూ, ఫిరాయింపులను ప్రోత్సహిస్తూనే మరో పక్కన ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నది.

ఆఖరికి ఓటరు జాబితా సమగ్ర సవరణ పేరుతో జరుగుతున్న ఓటర్ల ఏరివేత ప్రక్రియ తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. 'సర్' అనేది బోగస్ ఓటర్లను తొలగించేదిగా సాగాలి. కానీ లక్షలాది అర్హులైన ఓటర్లను అకారణంగా తొలగించడం, తాము అర్హులని నిరూపించుకునేందుకు సమయం ఇవ్వకపోవడం, ఈ లోపు ఎన్నికల తంతు పూర్తి కావడం, ఇదంతా చూస్తూ కూడా తప్పొప్పులు చెప్పాల్సిన వ్యవస్థలు చోద్యం చూడటం మరో విషాదం. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 22 ప్రకారం ఓటరు జాబితా నుంచి ఎవరి పేరైనా తొలగించాలంటే ముందుగా నోటీసు ఇచ్చి, వాదన విన్న తర్వాతనే నిర్ణయం తీసుకోవాలి. ఓటరు మరణిస్తే తప్ప, నోటీసు ఇవ్వకుండా జాబితా నుంచి పేరు తొలగించకూడదు. లాల్ బాబు హుస్సేన్ వర్సెస్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కేసులో సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేసింది. ఇదే విషయాన్ని ఇటీవల నల్సార్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తేల్చిచెప్పారు.

కానీ గంపగుత్తగా ఓట్లను తొలగించడం, ఆ తర్వాత వాదన వినేందుకు టైమ్ ఇవ్వకపోవడం ఏం పద్ధతి? నోటీసులు ఇవ్వడం అంటే శాశ్వతంగా ఓటును తొలగించినట్టు కాదని అధికాలు సూక్తులు చెప్తున్నారు. విచారణ పూర్తయి, ఎప్పుడో తిగి జాబితాలో పేరు చేర్చుతారా? ఈ లోపు జరిగిన ప్రజాస్వామిక హననానికి ఎవరు బాధ్యులు? ఓట్ల తొలగింపు ఫలితాలు ఎలా ఉంటాయో బెంగాల్‌లో చూశాం. అక్కడ దాదాపు 91 లక్షల ఓట్లు తొలగించారు. అప్పీళ్లకు వెళ్లిన 27 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 65 మంది ఎన్నికల అధికారులు కూడా ఓటు హక్కును కోల్పోయారంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. ఎన్నికలు నిర్వహించడానికి అర్హత కలిగిన వాళ్లు, ఓటు వేయడానికి అర్హులు కాదన్నమాట. ఇదీ విచిత్రం. ఈ నేపథ్యంలో బీజేపీ 46 శాతం ఓట్లతో 206 సీట్లను దక్కించుకున్నది. చాలా నియోజకవర్గాల్లో గెలిచిన అభ్యర్థి మెజారిటీ, తొలగించిన ఓట్ల కంటే తక్కువ. అంటే ఓట్ల తొలగింపుతో గెలుపోటములు ప్రభావితమయ్యాయని తేలింది. కానీ ఈసీ నిష్పక్షపాతంగా ఉన్నదంటే నమ్మాలంట! 'నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు.. నా యిచ్ఛయే గాక నాకేటి వెరపు' అనే కృష్ణశాస్త్రి కవిత గుర్తొస్తున్నది.

ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడే క్రమం కూడా వివిధ పరిణామాలను సంతరించుకున్నది. గతంలో దొంగ ఓట్లు వేయడం, పోలింగ్ బూత్‌లు ఆక్రమించి, రిగ్గింగ్‌కు పాల్పడటం, బ్యాలెట్ బాక్సులు ఎత్తుకెళ్లడం.. ఇలాంటి ఘటనలు జరిగేవి. ఇప్పుడు ఏకంగా ఓటర్లనే మాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు దేశంలో ప్రజాస్వామ్యం ఎటు పోతున్నది? ఇది నియంతృత్వానికి దారితీస్తున్నదా? అని అందరూ నిట్టూరుస్తున్న క్రమంలో ఒక ఆశాదీపంలా తళుక్కున మెరిసింది.. జెన్-జీ పోరాటం. పాలకపక్షాల అహంకార సౌధాలను కూల్చి, ప్రజాస్వామిక స్ఫూర్తిని చాటేందుకు సిద్ధమైంది. అప్రజాస్వామిక పాలన రాజ్యమేలుతుంటే ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ విఫలమైంది.

చేతగాని, చేవలేని ఆ పార్టీ నాయకత్వం పట్ల ప్రజల్లో ఆశలు అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రజాస్వామిక హక్కులను బీజేపీ పాలకులు నడిబజారులో బేరానికి పెడుతుంటే, చూసి తట్టుకోలేక యువతరం కదం తొక్కింది. 'ఇది మా దేశం, మా భవిష్యత్తును మేం కాపాడుకుంటాం' అని పోరు నడుపుతున్నది. ఈ క్రమంలో ఈసీలో అంతర్గతంగా జరిగిన లుకలుకలు బయటపడుతున్నాయి.

కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం-6పై ఇద్దరు ఈసీల అభ్యంతరాలను సీఈసీ పరిగణనలోకి తీసుకోలేదని బయటపడ్డది. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం సంచలనం సృష్టించింది. ఇక జెన్-జీ, ప్రజాపోరాటం ఉధృతమైంది. నేడు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరుగనున్నది. దీంతో ఢిల్లీ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రద్దీ ఏర్పడుతుందనే సాకులు చూపుతూ రైల్వేశాఖ పలు రైళ్లు రద్దు చేసింది. ప్రభుత్వం మెట్రో స్టేషన్లు మూసింది. బస్సులను నిలిపివేసింది. భారీ బలగాలను దింపింది. జెన్-జీకి, సీజేపీకి ప్రజల మద్దతు పెరుగుతున్నది. శ్రీశ్రీ చెప్పిన 'పావన నవజీవన బృందావన నిర్మాతలు' వీళ్లేనని జనంతా జేజేలు పలుకుతున్నరు... విజయోభవ అని ఆకాంక్షిస్తున్నరు.

ఆచితూచి 'రిజర్వ్' అడుగు!



నిత్యం చోటుచేసుకునే జాతీయ, అంతర్జాతీయ పరిణామాలూ, ప్రకృతి వైపరీత్యాలూ, వాటి పర్యవసానంగా ఏర్పడగల ఆర్థిక సంక్షోభాలపై దృష్టి పెట్టడమే, కలత పడటమే... అందుకు విరుగుడు ఆలోచించటమే రిజర్వ్ బ్యాంకు అసలు పని. గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న ఆర్థికరంగ నిపుణులు రిజర్వ్ బ్యాంకు రెపో రేటు పెంచకతప్పదని అంచనా వేస్తున్నారు. నిజానికి ఆ విషయంలో కొంత ఆలస్యం అయిందన్నది కూడా వారి విశ్లేషణ. ఏమైతేనేం...రెపో రేటును పావు శాతం పెంచుతూ బ్యాంకు ద్రవ్య విధాన సంఘం(ఎంపీసీ) భేటీ బుధవారం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలపై వడ్డీ రేట్లు బాగా పెరుగుతాయి. మధ్యతరగతి జీవులు ఈఎంఐలకు అధికంగా చెల్లించకతప్పదు. మూడేళ్ల క్రితం రెపో రేటు పెంచాక ఇదే మొదటి పెంపు. ఇన్నాళ్లూ రెపో రేటులో ఎలాంటి మార్పు లేకుండా కొనసాగించటం... అటుపై కొంచెం కొంచెం తగ్గించుకుంటూ రావటమే అందరూ చూశారు.

మొత్తానికి వడ్డీ రేటు 5.25 శాతం దగ్గర స్థిరపడింది. పావు శాతం పెంచటంతో ఇప్పుడది 5.50 శాతానికి చేరింది. కానీ ఇదింకా పెరుగుతుందన్న సంకేతాలిచ్చింది. మూడేళ్ల తటస్థంనుంచి 'క్రమానుగత కఠిన విధానం' దిశగా కదులుతున్నట్టు తెలిపింది. దసరా పండుగ సంరంభం సమీపిస్తుండగా తీసుకున్న ఈ నిర్ణయం సహజంగానే వినియోగదారుల కొనుగోలుశక్తిపై ప్రభావం చూపుతుంది. దాని తీవ్రత మరీ ఎక్కువ ఉండరాదని పావు శాతం పెంపునకు పరిమితమైంది. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని దేశాల ఆర్థికవ్యవస్థలనూ తలకిందులు చేస్తున్నాయి. విచక్షణారహితంగా విధిస్తున్న అదనపు సుంకాలు మనతో సహా ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ముడి చమురు ధరలు ఆకాశాన్నంటడానికి దారితీసిన పశ్చిమాసియా సంక్షోభం కూడా ఆయన పుణ్యమే. నేనున్నానంటూ సూపర్ ఎల్ నినో కూడా ఇప్పుడే వచ్చిపడింది. సాగురంగాన్ని అది తీవ్రంగా దెబ్బతీస్తోంది. వీటన్నిటివల్లా కనుచూపు మేరలో ఆశాజనకమైన పరిస్థితుల జాడ ఉండబోదని అందరికీ తెలుస్తూనే ఉంది. ఆహారధాన్యాల ధరలు అలా పైపైకి పోవటమే తప్ప కిందికి దిగొస్తున్న దాఖలా లేదు. రూపాయి పతనం ఎన్నడూ లేనంతగా ఉంది. ద్రవ్యోల్బణం పెరగటంతో నిజ వేతనాలు గణనీయంగా పడిపోయాయి. మార్కెట్‌కి వెళ్లడం పాపం... జేబు ఖాళీ అవుతోంది. మధ్యతరగతి ఆదాయాలు పడిపోతుంటే... నిరుద్యోగ భూతం భయపెడుతోంది. స్టాక్ మార్కెట్లు సరేసరి. గత తొమ్మిది నెలల్లో విదేశీ సంస్థాగత మదుపుదార్లు 4 లక్షల కోట్ల రూపాయలుపైగా వెనక్కు తీసుకున్నారని అంచనా. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాలను దాటి 7.8 శాతానికి గెంతడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అంతర్జాతీయంగా సంక్షోభం ఉన్నా మన ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండటమే కాదు...మెరుగైన దోవన వెళ్తున్నదని కేంద్రం ప్రకటించింది. మొన్న ఆగస్టుకు ద్రవ్యోల్బణం 4.82 శాతం ఉన్నదని లెక్కేశారు. మరి అప్పుడే రెపో రేటు పెంచాల్సివుండగా ఎందుకు ఆగినట్టని ఆర్థిక రంగ నిపుణులు వేస్తున్న ప్రశ్న హేతుబద్ధమైనదే. పరిస్థితులు బాగులేవన్నది నిజమే అయినా... ఆగస్టునాటికీ, ఇప్పటికీ వచ్చిన గణనీయమైన మార్పేమీ లేదు. సరఫరాకు సంబంధించిన ఒత్తిళ్లు లేదా డిమాండ్ పరమైన ఒత్తిళ్లు ఉన్నప్పుడే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం ఆ రెండూ లేవు. అయినా రేటు పెంచటమంటే ముందు జాగ్రత్త అనుకోవాలి. వృద్ధి రేటు లెక్క సరికాదని విభేదించినవారు గణనీయంగానే ఉన్నారు. ఆ మాటెలావున్నా 7.8 శాతం వృద్ధి రేటు అనేది నిర్ధ్వయంగా రెపో రేటు పెంచటానికి ఏ సెంట్రల్ బ్యాంకుకైనా అనువైనది. అది నేలచూపులు చూస్తుంటే పెంచితే అన్ని రకాల రుణాలపైనా వడ్డీ రేట్లు పెరిగి జనం మరింత కుంగుతారు. ఇలా బాగున్న వాతావరణమే పెంపుదలకు అనుకూలమని బ్యాంక్ భావించటంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఈ పెంపు ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తుందా లేదా అన్నది చెప్పలేం. అదనపు లిక్విడిటీని అదుపు చేయటంద్వారా అది సాధ్యమేనని ఎంపీసీలోని మెజారిటీ సభ్యులు భావించారు. చూద్దాం... ఏమవుతుందో!

మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. మోదీని మొగాంబోగా అభివర్ణిస్తూ– ఆయన భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. దేశానికి చేసిన నేరాలకు ప్రధాని మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడంతో పాటు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని రాహుల్ విమర్శించారు. చెన్నైలో శనివారం యువతతో ఛాత్రోన్ కీ గూంజ్ (విద్యార్థుల గళం) ఆరో ఎడిషన్ కార్యక్రమంలో మాట్లాడిన రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రజల గొంతులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దేశ రాజధాని దిల్లీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ – నగరమంతా మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పోలీసులు విద్యార్థులపై దాడులు చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ కూడా తన అనుచరుల ద్వారా విద్యార్థులపై దాడులు చేయించిందని విమర్శించారు.

'మోదీ సమస్య ఏంటంటే– ఆట ముగిసిపోయిందని ఆయన అర్థం చేసుకోవడం లేదు. గత 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న నాటకం ముగింపు దశకు చేరుకుంది. దేశానికి చేసిన నేరాలకు మోదీ మూల్యం చెల్లించేలా మేం చేస్తాం'

ఇక్కడ రాహుల్ గాంధీ ప్రధానిని మొగాంబోతో పోల్చారు. ప్రముఖ బాలీవుడ్ చిత్రం మిస్టర్ ఇండియాలోని విలన్ పాత్ర పేరు మొగాంబో. దివంగత నటుడు అమ్రిష్ పురి పోషించిన ఆ పాత్రను ప్రస్తావిస్తూ మొగాంబో మోదీ అని అన్నారు. రాహుల్ దీని గురించి మాట్లాడే సమయంలో వెనుక స్క్రీన్‌పై 1987లో విడుదలైన మిస్టర్ ఇండియా సినిమాలోని దృశ్యాన్ని కూడా ప్రదర్శించారు. అందులో అమ్రిష్ పురి ముఖానికి



బదులుగా మోదీ ముఖాన్ని మార్ఫింగ్ చేసి చూయించారు.

తమిళ సంస్కృతి, భాషపై మోదీ దాడి చేస్తున్నారు: రాహుల్

ఇక ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా– తమిళనాడు సంస్కృతి, భాష సహా చరిత్రపైనా దాడి ప్రారంభించారని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఆరోపించారు. తమిళనాడుపై హిందీని రుద్దుతామని అమిత్ షా బహిరంగంగా చెబుతున్నారని విమర్శించారు. కొత్త జాతీయ విద్యా విధానం (నీజ్యూ) ద్వారా 3 భాషల విధానాన్ని అమలు చేస్తూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్నే అణచివేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. తమిళనాడును ఇంకా నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియ ద్వారా శిక్షించేందుకు కూడా ప్రయత్నిస్తున్నారని రాహుల్ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

'తమిళ సంస్కృతి, భాష, చరిత్రపై మోదీ దాడి చేయడాన్ని మేం అనుమతించబోం. ఆయన తమిళనాడును ముట్టుకోలేరు' అని స్పష్టం చేశారు. తమిళనాడు నేలపైకి రావడం తనకు గౌరవంగా ఉందన్న రాహుల్, ఈ రాష్ట్ర ప్రజల నుంచి తాను తరచూ కొత్త విషయాలు నేర్చుకుంటానని తెలిపారు. ఈ క్రమంలోనే తమిళనాడు సామాజిక సంస్కర్త పెరియార్ బోధనలను రాహుల్ గుర్తుచేశారు. ఇతరులు చెప్పారని ఏ విషయాన్నీ గుడ్డిగా అనుసరించకూడదని, ప్రతి అంశాన్నీ విశ్లేషించి, ప్రశ్నించి తెలుసుకోవాలని పెరియార్ సూచించినట్లు చెప్పారు.

విద్యార్థులు దేనికీ భయపడొద్దు

ఇక దేనికి భయపడవద్దనేదే విద్యార్థులకు తాను చెప్పదలుచుకున్న ప్రధాన సందేశం అని రాహుల్ గాంధీ అన్నారు. ప్రశ్నించడం, ఆసక్తితో తెలియని విషయాలను తెలుసుకోవాలనుకోవడం సమాజ పురోగతికి పునాదులని, ప్రజాస్వామ్యం కూడా ప్రశ్నించే తత్వం నుంచే పుట్టిందని తెలిపారు. విద్యార్థులు స్వేచ్ఛగా ప్రశ్నలు అడగాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు భయపడకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై దాడి చేసిన వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని పేర్కొన్నారు. ఇక చెన్నైకి ముందు కోటా, దేహ్రాదూన్, ప్రయాగ్ రాజ్, పుణె, ఇందోర్ నగరాల్లో ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమాలను నిర్వహించింది కాంగ్రెస్. ఈ కార్యక్రమం గురించి ఆ పార్టీ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ కూడా స్పందించారు. రాహుల్ చేపట్టిన ఈ కార్యక్రమం రాజకీయ వివాదాలకు పరిమితం కాకుండా, వ్యవస్థలో ఉన్న లోతైన సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో సాగుతోందని అన్నారు. ప్రస్తుత వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దాంట్లో సమూల మార్పు తీసుకురావాలన్నదే రాహుల్ లక్ష్యమని పేర్కొన్నారు.

నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

దేశ రాజధానిలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్?కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. నిరసన చేపట్టేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు పలువురు ఇండీ కూటమి నేతలు, వామపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలను నిర్బంధించారు. మరోవైపు, జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన 7వేల మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న 600 మందికిపైగా వ్యక్తులను కూడా నిర్బంధించినట్లు తెలిపారు.

దీపేందర్ విమానంలోనే!

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపేందర్ భట్టాచార్యను పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిరసనలో పాల్గొనేందుకు ముంబయి నుంచి దిల్లీకి వచ్చిన ఆయనతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అందుకు సంబంధించిన దృశ్యాలను సీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తమ నాయకులను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా ముందస్తు ప్రణాళికతో అడ్డుకున్నారని పార్టీ ఆరోపించింది. ఇది పౌర హక్కులను ఉల్లంఘించడమేనని విమర్శించింది.

కేజ్రీవాల్, మమతా బెనర్జీ నిర్బంధం

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన నివాసం నుంచి జంతర్‌మంతర్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఆప్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేజ్రీవాల్‌ను ఎత్తుకుని బస్సు వద్దకు తీసుకెళ్లారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, దిల్లీ పార్టీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని ప్రధాని మోదీపై ఆరోపణలు చేశారు. దేశ యువత మేల్కొందని, అన్యాయానికి భయపడబోరని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సౌత్ అవెన్యూ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె పార్టీ నేతలతో కలిసి అక్కడే బైఠాయించారు. ఈ నిరసనలో డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్



సహా పలువురు తృణమూల్ నేతలు పాల్గొన్నారు. మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ వేసుకుని నిరసన తెలిపారు. దేశంలో పరిస్థితి ఎమర్జెన్సీని మించిపోయిందని, ఇది సూపర్ ఎమర్జెన్సీలా ఉందని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే తమ సందేశమని పేర్కొన్నారు.

వామపక్ష నేతలూ అదుపులోకి

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళ భవన్ బయట నుంచి జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిని అడ్డుకున్నారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. విజయన్ ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ప్రతిపక్ష నేతలను చూసి భయపడుతున్నందుకే పోలీసులు ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకుని, గంటపాటు వాహనాల్లో తిప్పారని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులపై ఇలాంటి చర్యలతో తమను భయపెట్టలేరని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దిల్లీని పోలీసు శిబిరంగా మార్చినప్పటికీ నిరసనల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఒక ప్రాంతంలో నిరసనను అడ్డుకున్నా, ఉద్యమ స్ఫూర్తిని ఆపలేరని వ్యాఖ్యానించారు.

ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరు: ఖర్గే

మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య జననిగా ఉన్న వ్యవస్థను నోరు మూసిన ప్రజాస్వామ్యంగా కేంద్ర సర్కార్ మార్చివేసిందని ఆరోపించారు. బీజేపీ– ఆర్ఎస్ఎస్ పిరికితనం నేడు బయటపడిందని ఆరోపించారు. "మన యువత, విద్యార్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు, యూట్యూబర్లు, కంటెంట్ సృష్టికర్తలు ఇలా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ నిర్బంధిస్తున్నారు" అంటూ పోస్ట్ చేశారు. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, లాఠీలు, పెల్లెట్లతో భారత ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరని స్పష్టం చేశారు. నిరంకుశ పాలనపై కాంగ్రెస్ పార్టీ, ఇండీ కూటమితో కలిసి సర్వశక్తులు ఒడ్డి పోరాడుతుందని ఖర్గే చెప్పారు. "భారత స్వాతంత్ర్యం కోసం మేం మా రక్తాన్ని చిందించాం. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి మా శక్తివంచన లేకుండా పోరాడుతూనే ఉంటాం" అని ఖర్గే తెలిపారు.

మోదీ, షా నడుపుతున్న నియంతృత్వ దేశం: ప్రియాంక గాంధీ

భారత్? ఇకపై ప్రజాస్వామ్య దేశని కాదని, ప్రధాని మోదీ– అమిత్ షాలు నడుపుతున్న నియంతృత్వమని ఆరోపించారు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా. "మొదట వారు 254 మంది ఎంపీలను తీవ్రంగా కొట్టి, వారి ప్రాథమిక రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ పూర్తిగా చట్టవిరుద్ధంగా నిర్బంధిస్తారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇతర నిరసనకారుల పట్ల కూడా వారు అదే విధంగా ప్రవర్తిస్తారు. ఆ తర్వాత వారు జాతీయ రాజధానిని ముట్టడిస్తారు, దానికి బారికేడ్లు పెట్టి అన్ని వైపులా మూసివేస్తారు, రైళ్లు, మెట్రోలను నిలిపివేస్తారు, ఇంటర్నెట్‌ను నిలిపివేస్తారు. అన్నిచోట్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తారు. నిరసన తెలిపే తమ రాజ్యాంగ హక్కును వినియోగించుకుంటున్న యువతీ యువకులను కొట్టి నిర్బంధిస్తారు. ఎన్నికల సంఘం కుమ్మక్కుతో వారు ఎన్నికలలో మోసం చేశారనడానికి, తమ ప్రభుత్వ చట్టబద్ధత బట్టబయలవుతోందని ఇది రుజువు కాకపోతే మరేమిటి? ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి వారితో కుమ్మక్కవుతున్న వారందరూ దేశద్రోహానికి పాల్పడుతున్నారు" అంటూ ఆరోపణలు చేశారు.

సుప్రీంకోర్టులో విచారణ

దిల్లీలో సీజేపీ నిరసనల వేళ మెట్రో, రైలు సేవలు పూర్తిగా నిలిపివేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాన్ని అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ, వారిపై చర్యలు ప్రారంభించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్?పై జస్టిస్ జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం విచారణ చేపట్టనుంది.

పాకిస్థాన్‌లో మరో దారుణం



పాకిస్థాన్‌లో మతపరమైన మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో దైవదూషణ ఆరోపణలతో ఓ క్రైస్తవుడి ఇల్లు, దుకాణానికి ముస్లిం మూక నిప్పుపెట్టింది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన 35కు పైగా క్రైస్తవ కుటుంబాలు ప్రాణభయంతో తమ ఇళ్లను విడిచి సురక్షిత ప్రాంతాలకు పారిపోయాయి. క్రిస్టియన్ డైలీ ఇంటర్నేషనల్-మార్నింగ్ స్టార్ న్యూస్ కథనం ప్రకారం పంజాబ్ ప్రావిన్స్‌లోని షేఖుపురా జిల్లా, ఘరియల్ కలాన్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. గ్రామంలో ఫార్మసీ నడుపుతున్న కమ్రాన్ మసీహ్ (40) అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపుల్లో దైవదూషణకు సంబంధించిన వీడియోను షేర్ చేశాడని స్థానిక ముస్లింలు ఆరోపించారు. ఈ ఆరోపణలతో గురువారం రాత్రి పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలియగానే శుక్రవారం రోజున వందలాది మంది ముస్లింలు కమ్రాన్ దుకాణం, ఇంటి వద్ద గుమిగూడారు. కొద్దిసేపటికే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు వ్యక్తులు ఆ రెండు భవనాలకు నిప్పుపెట్టారు. కమ్రాన్ అరెస్టు, ఆస్తుల ధ్వంసం వార్త తెలియగానే, గ్రామంలోని ఇతర క్రైస్తవ కుటుంబాలు మూకదాడులు జరగవచ్చనే భయంతో ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కమ్రాన్‌పై దైవదూషణ చట్టంలోని ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారనే దానిపై స్పష్టత లేదని ఆయన బంధువులు పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్రైస్తవుల ఆస్తులు, నివాసాలకు రక్షణ కల్పించేందుకు భారీ సంఖ్యలో పోలీసులను మోహరించినట్లు షేఖుపురా జిల్లా పోలీస్ కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం పరిస్థితి సున్నితంగా ఉన్నందున, దర్యాప్తు వివరాలు వెల్లడించలేమని ఓ అధికారి తెలిపారు.

దుర్వినియోగమవుతున్న దైవదూషణ చట్టాలు

పాకిస్థాన్‌లో దైవదూషణ చట్టాలు తరచూ దుర్వినియోగం అవుతున్నాయని, వ్యక్తిగత కక్షలు, తగాదాల కోసం వీటిని వాడుకుంటున్నారని మానవ హక్కుల సంఘాలు ఎప్పటినుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలే లక్ష్యంగా ఈ చట్టాలను ప్రయోగిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా నమోదైన 333 దైవదూషణ కేసుల్లో చాలా వరకు తప్పుడువని ఇటీవల ఓ పార్లమెంటరీ కమిటీకి అధికారులు నివేదించారు. అత్యధికంగా పంజాబ్ ప్రావిన్స్‌లోనే 116 కేసులు నమోదైనట్లు అధికారిక డేటా వెల్లడించింది. చాలా కేసుల్లో ఆరోపణలకు సరైన ఆధారాలు లేకపోవడంతో కొట్టివేసినట్లు అధికారులు కమిటీకి తెలిపారు. దైవదూషణ చట్టాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో, మైనారిటీలను రక్షించడంలో పాక్ ప్రభుత్వం విఫలమవుతోందని 'వాయిస్ ఆఫ్ పాకిస్థాన్ మైనారిటీ' వంటి సంస్థలు ఆరోపిస్తున్నాయి.

గెలిస్తే నిజాయితీ.. ఓడితే అవకతవకలా?



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ దిల్లీలో ప్రతిపక్షాలు, పౌర సమాజ సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఒకవైపు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తుంటే, ఎన్నికల సంఘం అలాగే సర్ ప్రక్రియకు మద్దతు ప్రకటించారు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు. భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను, అలానే భారత ఎన్నికల విధానాన్ని సమర్థిస్తూ దేశానికి చెందిన 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తగిన సాక్ష్యాధారాలు లేకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించడం వల్ల ప్రజాస్వామ్య సంస్థలపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని, అంతేకానీ నిరాధారంగా ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యారని ప్రచారం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు.

నమ్మకాన్ని దెబ్బతీస్తున్నట్లే!

దిల్లీలో శనివారం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ, ఆయనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే సివిల్ సర్వెంట్ల బృందం లేఖ విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవారము కాదని మాజీ అధికారులు లేఖలో స్పష్టం చేశారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ వంటి బాధ్యతలను ఎన్నో సార్లు నిర్వహించామని గుర్తుచేశారు. 'అసలు ఎలాంటి ఆధారాలు లేకుండా మన ఎన్నికలను రిగ్గింగ్ అంటూ ఒక పదాన్ని పదేపదే ఉపయోగిస్తున్నారు. ప్రతిసారీ అలా అనడం ప్రజాస్వామ్యంపై మనందరికీ ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది' అని లేఖలో పేర్కొన్నారు.

గెలిస్తే నిజాయతీ– ఓడితే అవకతవకలా?

ఎన్నికల్లో గెలిచినప్పుడు అదే వ్యవస్థ నిజాయతీగా ఉందని, అదే ఓటమి ఎదురైనప్పుడు అక్రమాలు, అవకతవకలకు పాల్పడిందని చెప్పడం సరికాదని మాజీ అధికారులు ఈ సందర్భంగా లేఖలో ప్రస్తావించారు. 'వ్యవస్థపై మీకు అనుమానమా? లేక ఫలితంపైనా?' అని ప్రశ్నిస్తూ, తగిన ఆధారాలేం లేకుండా తప్పుడు కథనాలను ప్రచారం చేయడం వల్ల ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని అన్నారు.

బిహార్ ఎన్నికలే ఉదాహరణ!

ఎన్నికల నిర్వహణలో వచ్చిన మార్పులకు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా మాజీ అధికారులు పేర్కొన్నారు. బిహార్ చరిత్రలోనే తొలిసారిగా అక్కడ ఒక్క రీపోలింగ్ కూడా అవసరం లేకుండా ఎన్నికలు పూర్తయ్యాయని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని తెలిపారు. మహిళలు కూడా రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్నట్లు లేఖలో గుర్తుచేశారు. అధికారులు పూర్తిగా మారిపోయినందువల్లే ఇది సాధ్యమైందని కాదని, ఎన్నికల సంఘం రూపొందించిన వ్యవస్థలో పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండటమే ఇందుకు కారణమని వివరించారు. ఇక ఈవీఎంలు, స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత గురించి ప్రస్తావించిన మాజీ అధికారులు– ప్రతి అభ్యర్థి తరఫున ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రక్రియను గమనించగలరని, పోలైన ఓట్ల లెక్కకు సంబంధించిన సంతకం చేసిన వివరాల్ని కూడా అందుకుంటారని తెలిపారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలోనే ఈవీఎంలను సీల్ చేస్తారని, ఆ సీల్స్‌పైనా వారి సంతకాలు ఉంటాయని వివరించారు. తర్వాత యంత్రాలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరుస్తారని, అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు వాటి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. .

ముగ్గురు ఉండడం కరెక్టే

ఎన్నికల సంఘంలో ముగ్గురు కమిషనర్లు ఉండటాన్ని కూడా మాజీ అధికారులు సమర్థించారు. 1995లో సుప్రీం కోర్టు దీనిని సమర్థించిందని, ఒకే వ్యక్తి చేతిలో అధికారం కేంద్రీకృతం కాకుండా ఉండటానికే ఈ విధానం ఉందని తెలిపారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఉండటం వల్ల కీలక నిర్ణయాలపై సమష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోలేరని అభిప్రాయపడ్డారు.

విమానంలో పైలట్ స్మిత్‌పై దాడి కేసు నమోదు చేసిన ఎన్ఐఏ



దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. ఇప్పటికే ఆ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన అధికారులు, దాడికి దారితీసిన పరిస్థితులు, విమానాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నం జరిగిందా అనే అంశాలపై దర్యాప్తు చేయనున్నారు. అయితే స్మిత్ మచ్చర్‌పై దాడి చేసిన ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. భారతీయ పైలట్‌పై దాడి జరగడం, విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా కూల్చివేయడానికి ప్రయత్నం జరిగి ఉండొచ్చనే అనుమానాల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు అవసరమని భావించింది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థకు కేసును అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎన్ఐఏ అక్టోబర్ 9న కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. యాంటీ హైజాకింగ్ చట్టం– 2016లోని సంబంధిత నిబంధనలతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)–1967 కింద కేసు నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16తో పాటు సెక్షన్ 15(1)(ఎ) నిబంధనలను కూడా ఆ కేసుకు వర్తింపజేసినట్లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం–2008 ప్రకారం, ఈ కేసులో పేర్కొన్న నేరాలు ఎన్ఐఏ విచారణ చేపట్టేందుకు వీలున్న నేరాల జాబితాలోకి వస్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం చట్టంలోని సెక్షన్ 6లోని ఉప సెక్షన్లు 5, 8తో పాటు సెక్షన్ 8 కింద తన అధికారాలను ఉపయోగించి దర్యాప్తునకు ఆదేశించింది. ఘటన వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా అనే అంశాన్ని కూడా ఎన్ఐఏ పరిశీలించనుంది. కాక్‌పిట్‌లో అసలు ఏం జరిగింది, దాడికి దారితీసిన పరిస్థితులు ఏమిటి, విమానాన్ని హైజాక్ చేయాలనే ఉద్దేశం ఉందా, విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించారా అనే కోణాల్లో దర్యాప్తు సాగనుంది. ఈ ఘటనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర పరిణామాలు ఉండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే కో పైలట్ దాడికి పాల్పడటానికి గల కారణాలు ఏమిటి, ఘటనకు ముందు విమానంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి అనే విషయాలపై ఇప్పటివరకు స్పష్టమైన వివరాలు వెల్లడికాలేదు. దాడి వెనుక ఉద్దేశం ఏమిటనేది కూడా తేలాల్సి ఉంది. ఆ అంశాలన్నింటినీ పరిశీలించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురావడమే ఎన్ఐఏ దర్యాప్తు లక్ష్యంగా ఉండనుంది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్ 1073 బయలుదేరింది. ఉదయం 7.05 గంటలకు గల్ఫ్ కాలమానం ప్రకారం ప్రయాణం ప్రారంభించింది. ఆ విమానంలో 174 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. విమానానికి భారతీయుడైన కెప్టెన్ స్మిత్ మచ్చర్? నాయకత్వం వహించగా, ఒమన్‌కు చెందిన వ్యక్తి కో పైలట్‌గా ఉన్నారు. విమానం జోర్డాన్–సౌదీ అరేబియా సరిహద్దు ప్రాంతం సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో కెప్టెన్ స్మిత్?పై కో పైలట్ కత్తితో దాడి చేశారు. ఆ దాడి విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా దాన్ని కూల్చివేయడానికి చేసిన ప్రయత్నం అయి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కాక్‌పిట్‌లో జరిగిన దాడిని గుర్తించిన ప్రయాణికులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. దాడికి పాల్పడిన కో పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. చివరకు అతడిని నిలువరించి కట్టడి చేసినట్లు సమాచారం. ఆ దాడిలో కెప్టెన్ స్మిత్ మచ్చర్? తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. విమానంలో ఇతర ఫ్లైదుబాయ్ పైలట్లు కూడా ఉండటంతో వారు విమాన నియంత్రణ బాధ్యతలు చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకుని విమానాన్ని సురక్షితంగా దించారు. సౌదీ అరేబియాలోని వాయవ్య ప్రాంతంలో ఉన్న టబుక్‌లోని ప్రిన్స్ సుల్తాన్ బి

స్థానిక ఎన్నికల్లో బీసీలకు సగటున 28.18% రిజర్వేషన్లు

-మొదటిపేజీ తరువాయి

అనంతరం మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, సంధ్యారాణి, అనిత, పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిలు సచివాలయంలో విలేకర్లకు ఈ వివరాలు వెల్లడించారు.

సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలు, తీర్పులను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ముందుగానే విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్ర నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్ వేసిందని అన్నారు. కమిషన్ నివేదిక వల్ల బీసీలకు రిజర్వేషన్లు పెరిగాయని చెప్పారు. బంతి తమ కోర్టు నుంచి ఎన్నికల సంఘం చేతుల్లోకి వెళ్లిపోయిందని, వారు ఏ క్షణంలో నోటిఫికేషన్ ఇచ్చినా తాము ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రధానాంశాలివీ.



చంద్రబాబు 34% తీసుకొస్తే.. గొడ్డలి పార్టీ 24 శాతానికి తగ్గించింది

దేశంలోనే తొలిసారిగా 1987లో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక 1995లో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి వీటిని 20 నుంచి 34 శాతానికి పెంచారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు దాన్నే కొనసాగించాయి. 2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చాక బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించేసింది. బీసీలు ఎప్పుడూ తెదేపా, ఎన్డీయేలతోనే ఉంటారని గొడ్డలి పార్టీకి, ఆ పార్టీ అధ్యక్షుడి కుటుంబానికి బీసీలంటే కక్ష. వారి పాలనలో బీసీలపై కనీవినీ ఎరగనంత దమనకాండ జరిగింది.

గొడ్డలి పార్టీ హయాంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇస్తున్నామంటూ జీవోలిచ్చి.. వారి పార్టీ వ్యక్తితోనే అప్పట్లో హైకోర్టులో పిటిషన్ వేయించారు. ఆ జీవోలను హైకోర్టు కొట్టేస్తే సుప్రీంకోర్టులో అప్పీలుకైనా వెళ్లకుండానే ఆగమేఘాలపై ఎన్నికలు నిర్వహించేశారు. దాంతో బీసీలు వివిధ స్థాయిల్లో 17 వేల పదవులు కోల్పోయారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలంటే డెడికేటెడ్ కమిషన్ వేసి ట్రిపుల్ టెస్ట్ నిర్వహించి ముందుకెళ్తే అభ్యంతరం లేదని అప్పట్లో హైకోర్టు చెప్పినా ఆ పార్టీ పట్టించుకోలేదు.

ఆటంకాలు సృష్టించకపోతే ఈ పాటికే 34% రిజర్వేషన్లతో ఎన్నికలు పూర్తి జనాభాలో సగం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత గౌరవమిచ్చేలా సరైన రిజర్వేషన్లు కల్పించాలనేది కూటమి ప్రభుత్వ ఉద్దేశం.

పంచాయతీరాజ్ చట్టంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఉన్నందున దాన్ని ఆధారంగా చేసుకుని జీవోలు ఇచ్చాం. వాటిని కొట్టేయాలంటూ మళ్లీ గొడ్డలి పార్టీ వారే హైకోర్టుకు వెళ్లారు. వారు కోర్టులో పిటిషన్ వేయకపోతే ఈపాటికే స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరిగిపోయి ఉండేవి. హైకోర్టు తీర్పు వచ్చిన వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించాం. దిల్లీకి వెళ్లి అక్కడి న్యాయకోవిదులతో మాట్లాడాం. చట్టబద్ధంగా బీసీలకు న్యాయం చేసేందుకు ప్రయత్నించాం.

స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే చిత్తుగా ఓడిపోతామని, అప్పుడు తమతో ఎవరూ మిగలరని గొడ్డలి పార్టీకి భయం. అందుకే ఎన్నికలు జరగకుండా ఆటంకాలు కల్పించింది. బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు సర్ ప్రక్రియ పూర్తయ్యాక ఆ జాబితాతో ఎన్నికలు నిర్వహించాలని, వార్డుల పునర్విభజన సరికాదని పేర్కొంటూ కోర్టుల్లో పిటిషన్లు వేసింది. వార్డుల పునర్విభజన చేస్తే మీకేంటి బాధ అని సుప్రీంకోర్టు గొడ్డలి పార్టీ తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. రాజీవ్ రంజన్ మిశ్ర కమిషన్ నివేదిక వల్ల బీసీలకు రిజర్వేషన్లు పెరిగాయే తప్ప తగ్గలేదు. గొడ్డలి పార్టీ ఇచ్చిన 24 శాతం కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లే ఇప్పుడు బీసీలకు లభిస్తాయి.

బీసీలకు తగ్గే చోట కూటమి పరంగా అదనపు అవకాశాలు

స్థానిక సంస్థను యూనిట్‌గా తీసుకుని అక్కడి జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు నిర్ణయించాం. తొలుత ఎస్టీ, అనంతరం ఎస్సీలకు 2011 జనాభా లెక్కల ఆధారంగా రాజ్యాంగపరంగా వర్తించే రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని.. మిగతా రిజర్వేషన్ల పరిధిలో బీసీలకు కేటాయింపులు చేశాం. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కారణంగా కొన్నిచోట్ల బీసీలకు చట్టబద్ధంగా కేటాయించగలిగే వాటా తగ్గే పరిస్థితులున్నా.. కూటమి పార్టీల పరంగా అదనంగా అవకాశాలు కల్పిస్తాం.

పదవులకు రిజర్వేషన్లు ఇలా..

పంచాయతీ వార్డు సభ్యులకు ఆ పంచాయతీని, సర్పంచులకు ఆ మండలంలోని పంచాయతీలను, ఎంపీటీసీ సభ్యులకు జిల్లాను, జడ్పీటీసీ సభ్యులు, జిల్లా పరిషత్ ఛైర్మన్లకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లు ఖరారు చేయాలని డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు చేసింది. కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఆయా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలను, మేయర్, మున్సిపల్ ఛైర్మన్లకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లు ఖరారు చేయాలని సూచించింది.

పార్టీ అభ్యర్థులకు రక్షణ కవచంగా లీగల్ సెల్

తాడేపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా, అవసరమైనప్పుడు న్యాయపరమైన ఆయుధంలా నిలవాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ లీగల్ సెల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పూడి శ్రీహరి, లీగల్ సెల్ స్టేట్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైన దశలోకి వెళ్తున్నాయని, పార్టీ లీగల్ సెల్ ఇక సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో చట్టాలు, నిబంధనలు, ఎన్నికల వ్యవస్థలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలవడం లేదని ఆయన అన్నారు. 2024 ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు, దాడులు, వేధింపులు జరిగాయని, అలాంటి పరిస్థితుల్లో లీగల్ సెల్ కార్యకర్తలకు అండగా నిలిచిందని అభినందించారు.

ఎస్ఐఆర్ పూర్తయ్యేలోపే ఎన్నికలకు ఎందుకు తొందర?

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో చనిపోయినవారి, డూప్లికేట్, అనర్హ ఓట్లు తొలగిస్తున్న పరిస్థితుల్లో, కొత్త ఓటర్ల జాబితా అందుబాటులోకి రాకముందే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం తొందరపడుతోందని సజ్జల అన్నారు. ఎస్ఐఆర్ ఫైనల్ జాబితా త్వరలోనే రావాల్సి ఉన్నప్పుడు, దానికి ముందే నోటిఫికేషన్ ఇవ్వాలనే ప్రయత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారిని జాబితాలో చేర్చకుండా ఎన్నికలు నిర్వహిస్తే వారి రాజ్యాంగబద్ధ హక్కు దెబ్బతింటుందని అన్నారు.

బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ నివేదికను ప్రజలకు అందుబాటులో పెట్టకుండా శాతం నిర్ణయించడం ఏ ప్రాతిపదికన జరిగిందో వెల్లడించాలని సజ్జల డిమాండ్ చేశారు. కమిషన్ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఆధారాలు వెల్లడించాలని అన్నారు.

నామినేషన్ దశ నుంచే అప్రమత్తంగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు పోరాటం నామినేషన్ దశ నుంచే ప్రారంభమవుతుందని సజ్జల అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు, ఎన్ఓసీలు, ఇతర అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వకుండా అభ్యర్థులకు ఇబ్బందులు సృష్టించే అవకాశం ఉందని, అందువల్ల ముందుగానే అన్ని డాక్యుమెంట్లు సిద్ధం చేయించాలని సూచించారు. రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత నామినేషన్లకు చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉన్నందున, అభ్యర్థులు, ప్రత్యామ్నాయ అభ్యర్థులు, అవసరమైన లీగల్ టీమ్‌లను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని చెప్పారు.

గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్ నెట్‌వర్క్

ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో అందుబాటులో ఉండే న్యాయవాదులను మ్యాపింగ్ చేసి, వారి కాంటాక్ట్ వివరాలను కంప్యూటరైజ్ చేయాలని సజ్జల సూచించారు. గ్రామ స్థాయి అభ్యర్థికి కూడా తనకు అవసరమైనప్పుడు ఏ న్యాయవాదిని సంప్రదించాలో ముందుగానే తెలిసేలా వ్యవస్థ ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో లీగల్ వార్‌రూమ్, నియోజకవర్గ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు, రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా నుంచి రాష్ట్ర కార్యాలయానికి సమాచారం చేరి, అవసరమైతే స్టేట్ ఎలక్షన్ కమిషన్, కోర్టులను ఆశ్రయించేలా వ్యవస్థ పనిచేయాలని చెప్పారు. సెన్సిటివ్ ప్రాంతాలు, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ముందుగానే గుర్తించి, అక్కడి పరిస్థితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

స్థానిక యుద్ధానికి సిద్ధం కండి... కార్యకర్త జోలికి ఎవరైనా వస్తే...

ప్రతి అక్రమాన్ని రికార్డు చేయాలి

ఎన్నికల సమయంలో అధికారులు, పోలీసులు లేదా ఇతరులు చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే వాటిని ఆధారాలతో నమోదు చేయాలని సజ్జల చెప్పారు. ప్రతి ఫిర్యాదు, ప్రతి ఘటన, ప్రతి అధికారిపై వచ్చిన ఆరోపణను డిజిటల్‌గా రికార్డు చేసి, అవసరమైతే లీగల్ చర్యలకు ఉపయోగించాలన్నారు. ఫీల్డ్ స్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని మీడియా, సోషల్ మీడియా, లీగల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రజల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

పార్టీ కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా నిలిచింది: పొన్నవోలు

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండున్నరేళ్లుగా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్న కేసులు, అరెస్టులు, వేధింపుల సమయంలో లీగల్ సెల్ వారికి భరోసాగా నిలిచిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆయన, పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టిన సందర్భాల్లో లీగల్ సెల్ వీధుల్లోనూ, కోర్టుల్లోనూ పోరాడిందన్నారు. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేస్తున్న ప్రతి న్యాయవాదిని భవిష్యత్తులో పార్టీ గుర్తిస్తుందని, వారికి తగిన గౌరవం లభించేలా చూడాలని కోరారు.

అభ్యర్థులకు న్యాయవాదులు వెన్నుముకగా నిలవాలి: చెవిరెడ్డి

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి లీగల్ సెల్ కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. కొత్తగా పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలు, నామినేషన్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండకపోవచ్చని, అందువల్ల న్యాయవాదులు వారికి ప్రతి దశలో మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

నామినేషన్ పత్రాలు నింపడం నుంచి దాఖలు చేయడం వరకు, కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర అవసరమైన పత్రాలు పొందడం వరకు లీగల్ సెల్ పూర్తి బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఏ అభ్యర్థి నామినేషన్ కూడా సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురికాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నామినేషన్‌కు సమర్పించిన పత్రాలన్నింటినీ స్కాన్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు డిజిటల్ రూపంలో కూడా పంపితే, తర్వాత పత్రాలు లేవని చెప్పి తిరస్కరించే పరిస్థితుల్లో ఆధారంగా ఉపయోగపడుతుందని సూచించారు. నామినేషన్ తిరస్కరణ జరిగితే వెంటనే న్యాయపరంగా స్పందించి అవసరమైతే కోర్టును ఆశ్రయించాలని చెప్పారు.

ప్రతి నియోజకవర్గంలో న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ అభ్యర్థులకు కేసులు, అరెస్టులతో భయపెట్టే ప్రయత్నాలు జరిగినా వారికి ధైర్యం చెప్పి, చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత లీగల్ సెల్‌పై ఉందన్నారు. తాను కూడా అనేక కేసులు, జైలు జీవితం ఎదుర్కొన్న అనుభవాన్ని ప్రస్తావిస్తూ, కష్టాలను భయపడకుండా గట్టిగా నిలబడటం ద్వారానే రాజకీయంగా ఎదగగలమని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే నాయకులే భవిష్యత్తులో మరింత ఉన్నత బాధ్యతలకు ఎదగగలరని అన్నారు. అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా దాఖలు కావడం నుంచి వారి గెలుపు వరకు న్యాయవాదులు వెన్నుముకగా నిలవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో లీగల్ సెల్ ప్రధాన పాత్ర పోషించాలి అని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం: మనోహర్‌రెడ్డి

లీగల్ సెల్ స్టేట్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సమావేశం సాధారణ పార్టీ సమావేశం కాదని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను పరిరక్షించే బాధ్యతతో ఏర్పాటు చేసిన సమావేశం అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పోలీస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలు, రౌడీ షీట్లు, బైండ్ ఓవర్ కేసులు తదితర అంశాల్లో న్యాయవాదులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

నియోజకవర్గ కమిటీలను వెంటనే పూర్తి చేసి, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. అవసరమైన న్యాయసహాయం 24 గంటలు అందుబాటులో ఉండేలా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. లీగల్ సెల్‌లో నిజాయితీగా, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారిని ప్రోత్సహించాలని, అవకాశవాదులను దూరంగా ఉంచాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు ప్రతి దశలో పార్టీ అభ్యర్థులకు పూర్తి న్యాయపరమైన రక్షణ కల్పించేందుకు లీగల్ సెల్ రాష్ట్రవ్యాప్తంగా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

ఏడు కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కూరగాయల పంపిణీ



వాకాడు, మహానగర్

మండల పరిధిలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయంలో కొడవలూరు రాధాకృష్ణారెడ్డి స్మృత్యర్థం ఆయన కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్తలు, వాకాడు సొసైటీ మాజీ చైర్మన్ కొడవలూరు దామోదరరెడ్డి ఆర్థిక సహకారంతో ఏడు కుటుంబాలకు రూ.9 వేల విలువైన ఫలసరుకులు, కూరగాయలను పంపిణీ చేశారు. మహాలయ పక్షం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి గుంటూరు జిల్లా వైఖానస ప్రముఖులు పరుచూరు విష్ణువర్ధనాచార్యులు మాట్లాడుతూ పితృదేవతలకు ఉత్తమ గతులు కలగాలనే సదుద్దేశంతో కొడవలూరు దామోదరరెడ్డి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నరేష్ శర్మ, శేషాద్రి శర్మ, రూపేష్ కుమార్ శర్మ, మల్లాపు కిరణ్, తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యుడు దీవి అనంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానం

-మొదటిపేజీ తరువాయి

సాగు విధానాలను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యంలో గుజరాత్ కంటే ఏపీ ముందంజలో ఉందని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రశంసించారని గుర్తుచేశారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం 2.28 శాతం తగ్గిందని, దీనికి గాను కేంద్రం నుంచి రావాల్సిన రూ.218 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఇప్పటికే లేఖ రాశామని చంద్రబాబు వెల్లడించారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు అనంతపురం జిల్లాలో 10 లక్షల పంట కుంటలు, చెక్ డ్యామ్‌లు తవ్వించామని, నదుల అనుసంధానంతో వర్షాభావ పరిస్థితులను కూడా అధిగమించవచ్చని అన్నారు. కషాయం, జీవామృతం తయారీకి అవసరమైన దేశీయ ఆవుల కోసం మరిన్ని గోకులాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న రైతులే తనకు అసలైన స్ఫూర్తి అని, వారి కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యం

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈరోజు ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి డయాగ్రిడ్ పూర్తయిందని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

పట్టిసీమ ఫలం..
సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు



పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు. పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

నేటి నుంచి విజయవాడ ఉత్సవ్ 2.0

ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

నగర వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటేలా ఉత్సవాల నిర్వహణ : ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడ, మహానగర్

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు విజయవాడ ఉత్సవ్ 2.0 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యే ఉత్సవాలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక చిరు వ్యాపారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈసారి ఉత్సవాల్లో స్థానిక కళాకారులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నామని, ప్రారంభ కార్యక్రమంలో సుమారు 45 నిమిషాల పాటు వారు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉంటుందని తెలిపారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళా ప్రదర్శనల అనంతరం అతిథులు వేదికపైకి చేరుకుంటారని వివరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు, ప్రతిభావంతులను వెలికితీసే పోటీలతో పాటు సినీ కళాకారుల కార్యక్రమాలు, ప్రత్యక్ష కబడ్డీ, వాలీబాల్ పోటీలు, గజరాజుల అంబారీ ప్రదర్శనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మైసూరు ఉత్సవాల తరహాలో ప్రత్యేక ఆకర్షణలతో కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దసరా ఉత్సవాలు, జాతీయ సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్--2.0ను ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కనకదుర్గమ్మను



దర్శించుకోనున్నారని, 15న జాతీయ సరస్ మేళాను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. ఉత్సవాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆహ్వానాలు పంపించినట్లు వెల్లడించారు. ఈ నెల 13న తమిళనాడు ముఖ్యమంత్రి, 17న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి విజయవాడకు వచ్చేలా షెడ్యూల్ ఉందని, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల పర్యటన వివరాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. నగరానికి లక్షలాది మంది భక్తులు, సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు, వ్యాపారులు ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఇళ్లు, వాణిజ్య సముదాయాలను అందంగా అలంకరించాలని, వ్యాపార సంస్థలు ప్రత్యేక లైటింగ్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. సందర్శకులను ఆకర్షించేలా ఉత్పత్తులపై ప్రత్యేక రాయితీలు ప్రకటించి స్థానిక చిరు వ్యాపారులకు సహకరించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అతిథులకు ఆత్మీయ ఆతిథ్యం అందించాలని పిలుపునిచ్చారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల పర్యటనలతో విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రత్యేకతలు దేశవ్యాప్తంగా మరింత విస్తరిస్తాయని కేశినేని చిన్ని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఆంధ్ర-కర్ణాటక రంజీ సమరం

ఉదయం 9.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం.. కేఎల్ రాహుల్ రాకతో ప్రత్యేక ఆకర్షణ





విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జట్ల మధ్య రంజీ ట్రోఫీ సమరం ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఉదయం 9.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుండగా, ప్రతిరోజూ 90 ఓవర్ల ఆట నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పోరులో విజయం సాధించడమే లక్ష్యంగా ఇరు జట్లు బరిలోకి దిగుతున్నాయి. మ్యాచ్‌కు ముందు ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ముమ్మరంగా సాధన చేసి సిద్ధమయ్యారు. భారత స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ ఈ మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. కర్ణాటక జట్టులో కరుణ్ నాయర్, మయాంక్ అగర్వాల్ వంటి ప్రతిభావంతులైన బ్యాటర్లు ఉండటంతో ఆ జట్టు పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు కెప్టెన్ రికీ భూయ్ నాయకత్వంలోని ఆంధ్ర జట్టు ప్రత్యర్థిని ఢీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. యువ ఆటగాళ్ల సమష్టి ప్రదర్శనతో విజయం సాధించాలనే లక్ష్యంతో ఆంధ్ర జట్టు బరిలోకి దిగుతోంది. మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మ్యాచ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఆటగాళ్లు, మ్యాచ్ నిర్వహణ సిబ్బంది భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టింది. ప్రేక్షకులకు అనుమతి లేదని, ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. కేఎల్ రాహుల్ పాల్గొంటుండటంతో ఈ మ్యాచ్‌పై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

సరస్ మేళాకు పటిష్ట ఏర్పాట్లు

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ కేశినేని చిన్ని

మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ వేదికగా సరస్ మేళా

ఈ నెల 15 నుంచి 31 వరకు పున్నమి ఘాట్‌లో నిర్వహణ



విజయవాడ, మహానగర్

మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు కృష్ణానది తీరంలోని పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న సరస్ మేళా ఏర్పాట్లను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం పరిశీలించారు. ఈ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నట్లు ఎంపీ తెలిపారు. గత ఏడాది గుంటూరులో నిర్వహించిన సరస్ మేళా విజయవంతమైందని, అదే స్ఫూర్తితో విజయవాడలోనూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు ఈ మేళాలో పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా, మెప్మా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేశినేని చిన్ని పిలుపునిచ్చారు. మహిళలు స్వయంగా తయారు చేసే హస్తకళా వస్తువులు, సంప్రదాయ ఉత్పత్తులు, గృహోపకరణాలకు సరస్ మేళా మంచి మార్కెటింగ్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు జాతీయ స్థాయిలో మార్కెట్ అవకాశాలు అందించడం ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడటమే మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులుగా మాత్రమే కాకుండా విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల నైపుణ్యం, సృజనాత్మకతకు గుర్తింపు తీసుకురావడంతో పాటు వారి ఉత్పత్తులను వినియోగదారులకు చేరువ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యాన్ చంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా మహోత్సవాలు



విజయవాడ, మహానగర్

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో వీకే శీనానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా, 12న గాయత్రీదేవిగా, 13న అన్నపూర్ణాదేవిగా, 14న మహాచండీదేవిగా, 15న లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. 16న మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవిగా, 17న మహాలక్ష్మీదేవిగా, 18న దుర్గాదేవిగా, 19న మహిషాసురమర్దినీదేవిగా, 20న రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు అనుగ్రహించనున్నారు. ఉత్సవాల తొలి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులకు దర్శనానికి అనుమతించనుండగా, మిగిలిన రోజుల్లో తెల్లవారుజామున 4 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శన సదుపాయం కల్పించనున్నారు. విజయదశమి రోజైన ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు దుర్గాఘాట్ వద్ద కృష్ణానదిలో హంసవాహన తెప్పోత్సవం నిర్వహించనున్నారు. దసరా ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా మహోత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రి విద్యుద్దీపకాంతులతో శోభిల్లుతోంది.

సుజనా ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



విజయవాడ, నంబర్ వన్

పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో సుజనా ఫౌండేషన్ ద్వారా ప్రతి వారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శనివారం చిట్టినగర్‌లోని సర్కిల్ వన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ శిబిరంలో దంత, నేత్ర పరీక్షలతో పాటు ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్‌రే, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్లు వైద్య సేవలు అందించారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను పేదలకు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ శిబిరంలో 122 మందికి నిపుణులైన వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించింది. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ హాస్పిటల్ వైద్యులు, పిన్నమనేని సిద్ధార్థ డెంటల్ కళాశాల వైద్యులు, అమరావతి ఐ హాస్పిటల్ వైద్యులు, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు, సుజనా ఫౌండేషన్ సిబ్బంది సేవలందించారు. కూటమి నేతలు నాగోతి రామారావు, కోటేశ్వరరావు, శ్రీను, దినవాహిని ట్రస్ట్ బోర్డు చైర్మన్ పైలా నరసింహారావు, జనసేన నేత వేంపలి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రూఫ్‌టాప్ సోలార్‌లో టాటా పవర్ అగ్రస్థానం

విజయవాడ, మహానగర్

టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్‌కు చెందిన టాటా పవర్ సోలారూఫ్ దేశంలో రూఫ్‌టాప్ సోలార్ రంగంలో అగ్రగామిగా నిలిచింది.

2026 జూలై--సెప్టెంబర్ త్రైమాసికంలో 88,397 సోలార్ ఇన్‌స్టాలేషన్లను పూర్తి చేసి, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 33 శాతం వృద్ధి సాధించింది. ఈ కాలంలో 426 మెగావాట్ల సామర్థ్యాన్ని జోడించి, 15 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2026--27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 1,68,530 ఇన్‌స్టాలేషన్లతో 801 మెగావాట్ల సామర్థ్యాన్ని ఏర్పాటు చేసింది. గత ఏడాదితో పోలిస్తే ఇన్‌స్టాలేషన్లలో 50 శాతం, సామర్థ్యంలో 25 శాతం వృద్ధి సాధించింది. దేశవ్యాప్తంగా నివాస, వాణిజ్య, పారిశ్రామిక విభాగాల్లో ఇప్పటివరకు 5.75 లక్షలకు పైగా ఇన్‌స్టాలేషన్లు పూర్తి చేసి, 5.67 గిగావాట్ల సామర్థ్యాన్ని అధిగమించింది. గత ఆరు నెలల్లో ఉత్తరప్రదేశ్‌లో 44,014 ఇన్‌స్టాలేషన్ల ద్వారా 172 మెగావాట్లు, మహారాష్ట్రలో 22,165 ద్వారా 100 మెగావాట్లు, రాజస్థాన్‌లో 21,275 ద్వారా 99 మెగావాట్లు, కేరళలో 15,477 ద్వారా 65 మెగావాట్ల సామర్థ్యాన్ని సాధించింది. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన లక్ష్యాలకు అనుగుణంగా 'ఘర్ ఘర్ సోలార్' ప్రచారంతో సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన పెంచుతోంది. అధిక పనితీరు గల సోలార్ మాడ్యూళ్లు, 25 ఏళ్ల పనితీరు వారంటీ, ఆర్థిక సదుపాయాలు, బీమా, విక్రయానంతర సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 740కి పైగా ఛానల్ భాగస్వాములతో సేవలందిస్తున్న సంస్థను సంప్రదించేందుకు 1800 25 77777 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవచ్చు.



గ్యాంగ్‌స్టర్ మోడ్‌లోకి నాని..
సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' షూటింగ్ షురూ!

నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూనే మరోవైపు తన ప్రయోగాత్మక చిత్రాలతో టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఇటీవలే ఆయన నటించిన 'ది ప్యారడైజ్' సినిమా నాని కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ భారీ విజయం అందించిన జోరును ఏమాత్రం తగ్గించకుండా, నాని తన తదుపరి ప్రాజెక్ట్ కోసం వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో నాని ఒక క్రేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సిద్ధమయ్యారు. "బ్లడీ రోమియో" అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ మరియు గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించబోతున్నట్లు సమాచారం. కేవలం యాక్షన్ హీరోగానే కాకుండా, ఒక వైవిధ్యమైన చెఫ్ పాత్రలోనూ, అలాగే మరోవైపు పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్‌గానూ ఆయన ద్విపాత్రాభినయం లేదా విభిన్న షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో అదరగొట్టనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల టాక్. ఈ సినిమా కోసం మేకర్స్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టనుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

ఇతరుల జీవితాలపై కామెంట్స్ చేయడానికి మీరెవరు? మృణాల్ ఠాకూర్ సీరియస్



సినీ తారల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, రూపురేఖలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేయడం ఈ మధ్యకాలంలో ఎక్కువైంది. ముఖ్యంగా హీరోయిన్లు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై పలువురు సినీ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటి, 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ కూడా ఇదే అంశంపై ఘాటుగా స్పందించారు. కత్రినా కైఫ్, కృతి సనన్‌లను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న విమర్శలను తప్పుబడుతూ, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించాలని హితవు పలికారు.తన తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ ఆన్‌లైన్ ట్రోలింగ్ గురించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత నిర్ణయాలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె అభిప్రాయపడ్డారు. కత్రినా కైఫ్, కృతి సనన్ వంటి నటీమణులు సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. వారి విజయాలను, కష్టాన్ని మరిచిపోయి చిన్న చిన్న విషయాలపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ప్రతి అంశంలోనూ ఇతరులను తప్పుపట్టడం మానుకోవాలని, సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే జనాలకు పిచ్చి పట్టినట్టుగా అనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇటీవల కత్రినా కైఫ్ ఓ వేడుకలో పాల్గొన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోల్లో ఆమె శారీరక రూపురేఖలపై కొందరు నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తల్లి అయిన తర్వాత శరీరంలో సహజంగా వచ్చే మార్పులను కూడా కొందరు విమర్శించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఒక మహిళ శరీరంలో వచ్చే మార్పుల ఆధారంగా ఆమెను అంచనా వేయడం, బహిరంగంగా అవమానించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఈ ఘటనతో మరోసారి తెరపైకి వచ్చాయి. మరోవైపు, నటి కృతి సనన్ కూడా ఓ ప్రకటనలో ధరించిన దుస్తుల కారణంగా విమర్శలు ఎదుర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా విడుదలైన ఓ నగల ప్రకటనలో ఆమె ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆ దుస్తులు పండుగ సందర్భానికి తగినవి కావంటూ విమర్శలు రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ వివాదం నేపథ్యంలో సదరు ప్రకటనను తొలగించారు.. తన ఉద్దేశం ఎవరి మనోభావాలను దెబ్బతీయడం కాదని కృతి సనన్ వివరణ ఇచ్చింది. కాగా, సామాజిక మాధ్యమాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా ఇలాంటి విమర్శలను ఎదుర్కొంటున్నారని మృణాల్ ఠాకూర్ అభిప్రాయపడ్డారు. అయితే మహిళల దుస్తులు, శరీరాకృతి, వ్యక్తిగత నిర్ణయాలపై తరచూ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ఆందోళన కలిగిస్తుంది.

ఒక్కో సినిమాకు రూ.8 కోట్లు తీసుకుంటున్నానా? ప్రచారాలపై శ్రీనిధి శెట్టి క్లారిటీ



సినిమా ఇండస్ట్రీలో ఒక భారీ విజయం అందుకున్న తర్వాత హీరోలు, హీరోయిన్ల పారితోషికాలపై రకరకాల వార్తలు ప్రచారంలోకి రావడం సహజం. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటీనటుల రెమ్యునరేషన్లపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. తాజాగా 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న కన్నడ నటి శ్రీనిధి శెట్టి పారితోషికంపై ఇలాంటి ప్రచారమే తెరపైకి వచ్చింది. ఆమె ఒక్కో సినిమాకు రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు తీసుకుంటున్నారంటూ వార్తలు చక్కర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రచారంపై స్పందించిన శ్రీనిధి శెట్టి అసలు విషయాన్ని వెల్లడించారు. శ్రీనిధి శెట్టి ఒక్కో సినిమాకు భారీ మొత్తంలో పారితోషికం డిమాండ్ చేస్తున్నారంటూ వస్తున్న వార్తలను ఆమె ఖండించారు. ఇప్పటివరకు తాను చేసిన సినిమాల సంఖ్యను పరిశీలిస్తే ఇంత భారీ పారితోషికం గురించి జరుగుతున్న ప్రచారం ఆశ్చర్యంగా ఉందని ఆమె పేర్కొన్నారు. కేవలం పుకార్ల ఆధారంగా ఇలాంటి వార్తలను నమ్మవద్దని సూచించారు. సినిమాలను ఎంపిక చేసుకునేటప్పుడు పారితోషికానికే ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆమె స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తనకు నచ్చిన కథ, అందులో తన పాత్రకు ఉన్న ప్రాధాన్యం, సినిమా నాణ్యత వంటి అంశాలనే ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటానని వెల్లడించారు. 'కేజీఎఫ్' చిత్రాలతో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత వరుసగా ఎక్కువ సినిమాలు చేసుకుంటూ వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, తాను అలా చేయలేదని శ్రీనిధి శెట్టి అభిప్రాయపడింది. డబ్బు సంపాదించడమే లక్ష్యమైతే ఆ సినిమా విజయాన్ని ఆసరాగా చేసుకుని అనేక ప్రాజెక్టులకు అంగీకరించి ఉండేదాన్నని పేర్కొంది.

ఢిల్లీ హైకోర్టులో విజయ్ దేవరకొండకు ఊరట.. వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పిస్తూ కోర్టు తీర్పు



నటుడు విజయ్ దేవరకొండకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన అనుమతి లేకుండా పేరు, ఫొటోలు, గొంతు మరియు ఇతర వ్యక్తిగత హక్కులను (్రపతీంశీఅుశ్రీఱ్ఱఎ =అస్త్రష్ట్రం) అనధికారికంగా ఇతరులు వాడకుండా ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), డీప్‌ఫేక్స్ మరియు ఫేస్-మార్ఫింగ్ టెక్నాలజీలను ఉపయోగించి ఆయనను అశ్లీల లేదా అసభ్యకర రీతిలో చిత్రీకరిస్తున్న కంటెంట్‌పై కోర్టు తీవ్రంగా స్పందించింది. న్యాయమూర్తి జస్టిస్ వికాస్ మహాజన్ ఈ ఆదేశాలు జారీ చేస్తూ.. మెటా (వీఱ్ఱు), గూగుల్ ఎక్స్ (శ) వంటి సోషల్ మీడియా సంస్థలు నటుడు గుర్తించిన అక్రమ కంటెంట్, వీడియోలు, రీల్స్, పోస్టులు మరియు అకౌంట్‌లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే, ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు సంబంధిత లింక్‌లను 72 గంటల్లోగా టేకడౌన్ చేయాలని స్పష్టం చేశారు. విజయ్ దేవరకొండ తన పేరు (విజయ్ దేవరకొండ, విజయ్ సాయి దేవరకొండ), 'ఎణ' అనే ఇనిషియల్స్, సిగ్నేచర్లు, వాయిస్ రికార్డింగ్‌లు, ఫ్యాషన్ స్టైల్, సినిమా స్టిల్స్ వంటి వాటిని వాణిజ్యపరంగా ఎవరూ దుర్వినియోగం చేయకుండా రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయనకు ఎంతో ఇష్టమైన "రౌడీ" (=శీషuఎ) అనే పేరును కేవలం ఒంటరిగా వాడడంపై మాత్రం కోర్టు ఎక్స్-పార్టీ ఇంజంక్షన్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఆ పేరు ఆయనకు మాత్రమే ప్రత్యేకంగా చెందుతుందని నిరూపించే తగిన సాక్ష్యాధారాలు అవసరమని కోర్టు పేర్కొంది. అదే సమయంలో, "రౌడీ" అనే పదాన్ని విజయ్ ఏఐ లేదా మార్ఫ్ ఇమేజ్‌లతో కలిపి వాడితే మాత్రం అది ఆయన వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేసింది. ఈ కేసు విచారణను డిసెంబర్ 3కి మరియు తదుపరి విచారణను ఫిబ్రవరికి వాయిదా వేస్తూ, ప్రతివాదులు నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.



రూ.2 కోట్ల బడ్జెట్‌తో సినిమా.. బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్ల వసూళ్లు

'ప్రేమద ఊరాలి' సంచలనం

సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే మాటను మరోసారి నిజం చేస్తోంది కన్నడ చిత్రం 'ప్రేమద ఊరాలి'. విడుదలకు ముందు పెద్దగా అంచనాలు లేకుండా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. భారీ ప్రచారం, స్టార్ హీరోలు, భారీ బడ్జెట్ లేకుండానే కేవలం కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వసూళ్లలో దూసుకుపోతోంది. కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం త్వరలోనే కర్ణాటకలో రూ.50 కోట్ల వసూళ్ల మార్కును అందుకోనుందని ట్రేడ్ వర్గాల అంచనా. 'ప్రేమద ఊరాలి' సినిమా విడుదలైన తొలిరోజుల్లో బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ప్రేక్షకుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు లేకపోవడంతో మొదట్లో వసూళ్లు కూడా నెమ్మదిగానే సాగాయి. అయితే సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మౌత్ టాక్ బలపడటంతో రోజురోజుకూ థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమాకు అండగా నిలుస్తుండటం విశేషం. కథలోని భావోద్వేగాలు, కుటుంబ సంబంధాల చుట్టూ సాగే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో తొలి రోజుల్లో నెమ్మదిగా సాగిన వసూళ్లు క్రమంగా పుంజుకుని ఇప్పుడు భారీ స్థాయికి చేరుకుంటున్నాయి. 'ప్రేమద ఊరాలి' ఒక సాధారణమైన కథను గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం. కుటుంబ సంబంధాలు, మనుషుల మధ్య అనుబంధాలు, భావోద్వేగాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు. భారీ యాక్షన్ సన్నివేశాలు లేదా అద్భుతమైన విజువల్ హంగుల కంటే కథలోని సహజత్వం, పాత్రల మధ్య భావోద్వేగాలే సినిమాకు ప్రధాన బలంగా నిలిచినట్లు తెలుస్తోంది. ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి భారీ బడ్జెట్ తప్పనిసరి కాదని, మంచి కథతోనూ విజయాన్ని అందుకోవచ్చని ఈ సినిమా నిరూపిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కుటుంబమంతా కలిసి చూసే సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎలా ఉంటుందో 'ప్రేమద ఊరాలి' విజయ ప్రయాణం మరోసారి చాటిచెబుతోంది. ఈ సినిమా వసూళ్ల గురించి చర్చ జరుగుతున్న సమయంలో అందరినీ ఆశ్చర్యపరుస్తున్న విషయం దాని నిర్మాణ వ్యయం. 'ప్రేమద ఊరాలి' కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో రూపొందినట్లు సమాచారం. అలాంటి చిన్న బడ్జెట్ చిత్రానికి రూ.50 కోట్ల వసూళ్లు సాధించే స్థాయిలో ఆదరణ లభించడం విశేషంగా మారింది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999